RNI TEL TEL 2024/89323.

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

| నిజామాబాద్ | సంపుటి : 03 | సంచిక : 40 | ఫిబ్రవరి 26 గురువారం 2026 | ఎడిటర్ : రాచమల్లు మాధవి | పేజీలు 08 | వెల : రూ. 6.00 |
|---|---|---|---|---|---|---|
| Nizamabad | Vol: 03 | Vol: 40 | February 26 Thursday 2026 | Editor : rachamallu madhavi | Pages 08 | Cost: Rs 6.00 |


## అన్వేష్ పై లుకౌట్ నోటీసులు విదేశాల్లో ఉండడంతో పంజాగుట్ట పోలీసుల వెల్లడి

2

# కుమ్మెర ఘటన సభ్యసమాజానికే మచ్చ

### పసిపాప కుటుంబాన్ని పరామర్శించిన కేటీఆర్



నాగర్‌కర్నూల్ జన సంఘర్షణ

జిల్లాలోని కుమ్మెర మల్లన్న జాతరలో రెండు నెలల పసికందు మృతి చెందిన ఘటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బుధవారం బాధిత కుటుంబాన్ని స్వయంగా పరామర్శించిన ఆయన, వారికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వంపై మండిపడ్డారు. మానవత్వానికే మచ్చ: "కేవలం దైవ దర్శనం అడిగిన పాపానికి, రెండు నెలల పసిగుడ్డు అని కూడా చూడకుండా దాడి చేసి ప్రాణాలు తీయడం

➤ మిగతా 2వ పేజిలో..

### ఇక సొంత భవనాల్లోనే

# రెవెన్యూ సేవలు

### మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడి



హైదరాబాద్ జన సంఘర్షణ : తెలంగాణ రాష్ట్రంలోని తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాలకు శాశ్వత భవనాలు నిర్మించాలని ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రజలకు పాలనను మరింత చేరువ చేయడంతో పాటు పారదర్శక సేవలు అందించడమే లక్ష్యంగా ఈ అడుగు వేస్తున్నట్లు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం సచివాలయంలో ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన ఈ వివరాలను వెల్లడించారు. మంత్రి వివరించిన వివరాల ప్రకారం.. భవనాల నిర్మాణ ప్రక్రియ రెండు విడతల్లో జరగనుంది: ప్రస్తుతం అద్దె భవనాల్లో కొనసాగుతున్న 60 తహసీల్దార్ కార్యాలయాలు, 5 ఆర్డీవో కార్యాలయాలకు అన్ని ఆధునిక వసతులతో కూడిన కొత్త భవనాలను నిర్మిస్తారు.

రాష్ట్రవ్యాప్తంగా శిథిలావస్థకు చేరిన మరో 170 కార్యాలయాలను గుర్తించి, వాటి స్థానంలో కొత్త వాటిని నిర్మిస్తారు.రాష్ట్రవ్యాప్తంగా నిర్మించే అన్ని రెవెన్యూ భవనాలు ఒకే రకమైన మోడల్ (డిజైన్)లో ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ప్రజలు కార్యాలయానికి వచ్చినప్పుడు ఇబ్బంది పడకుండా, తక్కువ ఖర్చుతో అత్యుత్తమ మౌలిక సదుపాయాలు కల్పించేలా డిజైన్లను రూపొందిస్తున్నారు.

ఈ భవన నమూనాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించి తుది నిర్ణయం తీసుకోనున్నట్లు మంత్రి తెలిపారు. రెవెన్యూ వ్యవస్థను ఆధునీకరించి, ప్రజలకు వేగవంతమైన సేవలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా మంత్రి పునరుద్ఘాటించారు.

# భారత్-ఇజ్రాయెల్ వ్యూహాత్మక బంధం

### ప్రధాని మోదీ చారిత్రక పర్యటన ప్రారంభం



న్యూఢిల్లీ/టెల్ అవీవ్ జన సంఘర్షణ :

భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రెండు రోజుల అధికారిక పర్యటన నిమిత్తం బుధవారం ఇజ్రాయెల్‌కు చేరుకున్నారు. విమానాశ్రయంలో మోదీకి ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు, ఆయన సతీమణి సారా నెతన్యాహు ఘనంగా స్వాగతం పలికారు. ఇద్దరు అగ్రనేతలు ఆత్మీయ ఆలింగనం చేసుకుని తమ స్నేహాన్ని చాటుకున్నారు. ప్రధాని మోదీని తన "ఆత్మీయ మిత్రుడు"గా నెతన్యాహు అభివర్ణించారు. భారత ప్రధాని రాకతో ఇజ్రాయెల్ వీధులన్నీ త్రివర్ణ పతాకాలతో ముస్తాబై పండుగ వాతావరణాన్ని సంతరించుకున్నాయి. ఈ పర్యటనలో భాగంగా రక్షణ, సాంకేతికత, వ్యవసాయం మరియు జలవనరుల యాజమాన్యం వంటి కీలక రంగాలలో ద్వైపాక్షిక సహకారాన్ని పెంపొందించుకోవడంపై ఇరు నేతలు చర్చించనున్నారు. ప్రధాని మోదీ ఇజ్రాయెల్ పార్లమెంట్

➤ మిగతా 2వ పేజిలో..

# అమెరికాకు ఇది స్వర్ణయుగం

### స్టేట్ ఆఫ్ ది యూనియన్ ప్రసంగంలో ట్రంప్ ధీమా



వాషింగ్టన్ జన సంఘర్షణ :

అమెరికా చరిత్రలో గతంలో కంటే ప్రస్తుతం అత్యంత శక్తివంతమైన, సంపన్నమైన దశలో ఉందని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. మంగళవారం జరిగిన 'స్టేట్ ఆఫ్ ది యూనియన్' కార్యక్రమంలో ఆయన సుదీర్ఘంగా ప్రసంగించారు. తన పాలన దేశ చరిత్రలో ఒక గొప్ప మలుపు అని, అమెరికా పునరుజ్జీవం వైపు అడుగులు వేస్తోందని ఆయన పేర్కొన్నారు. అమెరికా ఆర్థిక వ్యవస్థ అత్యంత వేగంగా వృద్ధి చెందుతోందని, సాదాసీదా స్థితి నుంచి దేశాన్ని ప్రపంచ అగ్రగామిగా నిలబెట్టామని ట్రంప్ చెప్పారు. గ్యాస్ ధరల తగ్గింపు, చమురు

➤ మిగతా 2వ పేజిలో..

# ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభం



హైదరాబాద్ జన సంఘర్షణ :

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా బుధవారం నుంచి ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు కోలాహలంగా మొదలయ్యాయి. మొదటి రోజు ప్రథమ సంవత్సర విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా, గురువారం నుంచి ద్వితీయ సంవత్సర విద్యార్థుల పరీక్షలు ప్రారంభం కానున్నాయి. పరీక్షా కేంద్రాలు: రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లో

➤ మిగతా 2వ పేజిలో..

## 'న్యాయవ్యవస్థలో అవినీతి' పాఠంపై

# సుప్రీంకోర్టు ఆగ్రహం..

### కేంద్రం కీలక నిర్ణయం

న్యూఢిల్లీ జన సంఘర్షణ : ఎన్‌సీఈఆర్‌టీ 8వ తరగతి పాఠ్యపుస్తకంలో 'న్యాయవ్యవస్థలో అవినీతి' అనే అంశాన్ని చేర్చడంపై సుప్రీంకోర్టు

➤ మిగతా 2వ పేజిలో..



## కుమ్మెర ఘటన సభ్యసమాజానికే మచ్చ

**మొదటిపేజీ తరువాయి..** అత్యంత క్రూరం. ఇది మానవత్వానికే మచ్చ తెచ్చే ఘటన" అని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దారుణానికి ఒడిగట్టిన వారు ఏ పార్టీ వారైనా, ఎంతటి వారైనా వదిలిపెట్టకూడదని హెచ్చరించారు. నిందితులను కాపాడే ప్రయత్నం చేయవద్దని పోలీసులకు సూచించారు. ఈ ఘటనకు కారణమైన ఎనిమిది మందిపై వెంటనే హత్యానేరం కింద కేసులు నమోదు చేయాలన్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు. 'పసిపాపకు కులం, మతం తెలియదని తెలిపారు. బాధితులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ అండగా ఉంటుందన్నారు. అసెంబ్లీ వేదికగా రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని నిలదీస్తాం" అని కేటీఆర్ భరోసా ఇచ్చారు.

## అమెరికాకు ఇది స్వర్ణయుగం

**మొదటిపేజీ తరువాయి..** ఉత్పత్తి పెంపు వంటి చర్యలు ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చాయని వివరించారు. చమురు నిల్వలు: వెనిజులాతో కుదిరిన కొత్త ఒప్పందాల ద్వారా 80 మిలియన్ బ్యారెళ్ల చమురును సేకరించామని, దీనివల్ల దేశీయంగా ఇంధన లభ్యత పెరిగిందని తెలిపారు. గత తొమ్మిది నెలల్లో అక్రమ వలసల సంఖ్యను సున్నాకు తగ్గించగలిగామని, సరిహద్దు భద్రతను కట్టుదిట్టం చేయడంతో పాటు మాదకద్రవ్యాల రవాణాను అరికట్టామని పేర్కొన్నారు. హాకీ ఒలింపిక్స్ విజేత కానర్ హెలెబ్యాక్‌కు అమెరికా అత్యున్నత పౌర పురస్కారం 'ప్రెసిడెన్షియల్ మెడల్ ఆఫ్ ఫ్రీడమ్' అందజేయనున్నట్లు ప్రకటించారు. 2028 ఒలింపిక్స్‌కు అమెరికా ఆతిథ్యం ఇవ్వబోతోందని గుర్తుచేశారు. ఇరాన్ విషయంలో హెచ్చరిక:

ఇరాన్ అణ్వాయుధ కార్యక్రమాలపై ట్రంప్ తీవ్రస్థాయిలో స్పందించారు. ఇరాన్ తన అణ్వాయుధ ప్రయత్నాలను విరమించుకోవాలని, లేనిపక్షంలో కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అమెరికాను, ఐరోపాను లక్ష్యం చేసుకోగల క్షిపణులను ఇరాన్ అభివృద్ధి చేస్తోందని ఆరోపించారు. గతంలో జరిగిన దాడుల వల్ల ఇరాన్ అణు కార్యక్రమం మందగించిందని, అయితే ఆ దేశం ఇప్పటికీ అణ్వాయుధాల తయారీపై స్పష్టమైన హామీ ఇవ్వలేదని విమర్శించారు.

ట్రంప్ సుమారు 1 గంట 50 నిమిషాల పాటు ప్రసంగించి కొత్త రికార్డు సృష్టించారు. గతంలో 2000 సంవత్సరంలో బిల్ క్లింటన్ చేసిన 90 నిమిషాల ప్రసంగమే అత్యధికం కాగా, ట్రంప్ ఇప్పుడు ఆ రికార్డును అధిగమించారు. ప్రజలకు జవాబుదారీగా ఉండే ప్రభుత్వాన్ని నడపడమే తన లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు.

## భారత్-ఇజ్రాయెల్ వ్యూహాత్మక బంధం

**మొదటిపేజీ తరువాయి..** (నెస్సెట్) ను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఈ గౌరవం దక్కించుకోబోతున్న తొలి భారత ప్రధానిగా ఆయన రికార్డు సృష్టించనున్నారు. మొదటి రోజు నెతన్యాహుతో ప్రత్యేక విందులో పాల్గొనే మోదీ, రెండో రోజు హోలోకాస్ట్ మెమోరియల్ (యాద్ వాషెమ్) సందర్శనతో పాటు ఆ దేశాధ్యక్షుడు ఐజాక్ హెర్జోగ్‌తో భేటీ కానున్నారు. ఈ పర్యటన రెండు దేశాల మధ్య ఉన్న 'స్పెషల్ స్ట్రాటజిక్ పార్ట్‌నర్‌షిప్'ను తదుపరి స్థాయికి తీసుకువెళ్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ముఖ్యంగా కృత్రిమ మేథ క్వాంటం కంప్యూటింగ్ మరియు సైబర్ సెక్యూరిటీ వంటి ఆధునిక సాంకేతిక అంశాలపై కీలక ఒప్పందాలు జరిగే అవకాశం ఉంది.

## 'న్యాయవ్యవస్థలో అవినీతి' పాఠంపై సుప్రీంకోర్టు ఆగ్రహం..

**మొదటిపేజీ తరువాయి..** తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. అత్యున్నత న్యాయస్థానం స్పందనతో కేంద్ర ప్రభుత్వం తక్షణమే అప్రమత్తమై, వివాదాస్పద పాఠ్యాంశాలను తొలగిస్తామని ప్రకటించింది. ఈ అంశంపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం బుధవారం ఘాటుగా స్పందించింది. ఇలాంటి పాఠ్యాంశాలు న్యాయమూర్తులు, న్యాయవాదుల మనోభావాలను దెబ్బతీస్తాయని, వ్యవస్థ ప్రతిష్టకు భంగం కలిగిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. సుమోటో విచారణ: ఈ వ్యవహారంపై అవసరమైతే తామే స్వయంగా (సుమోటోగా) విచారణ చేపడతామని సీజేఐ హెచ్చరించారు.

న్యాయవాదుల వాదన: సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, అభిషేక్ మను సింఘ్వీలు ఈ విషయాన్ని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. రాజకీయ నేతల అవినీతిని వదిలేసి, కేవలం న్యాయవ్యవస్థనే లక్ష్యంగా చేసుకోవడం సరికాదని వారు వాదించారు. ఇటీవల ఎన్‌సీఈఆర్‌టీ 'న్యాయవ్యవస్థ' అనే అధ్యాయాన్ని విస్తరిస్తూ.. వ్యవస్థలోని లోపాలు, సవాళ్లు, కేసుల జాప్యం మరియు అవినీతి వంటి అంశాలను చేర్చింది. విద్యార్థులకు వాస్తవ పరిస్థితులపై అవగాహన కల్పించడమే తమ ఉద్దేశమని సంస్థ పేర్కొంది. ప్రతికూల ప్రభావం: అయితే, చిన్న వయసులోనే పిల్లలకు న్యాయవ్యవస్థపై ప్రతికూల భావన ఏర్పడే ప్రమాదం ఉందని న్యాయ నిపుణులు ఆందోళన వ్యక్తం చేశారు. కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసిన వెంటనే కేంద్రం దిద్దుబాటు చర్యలు చేపట్టింది. పాఠ్యపుస్తకాల్లో ఇలాంటి అంశాలు ఉండటం సమంజసం కాదని, విద్యార్థులకు స్ఫూర్తినిచ్చే విషయాలను బోధించాల్సి ఉందని ఉన్నత స్థాయి వర్గాలు తెలిపాయి. త్వరలోనే ఆ వివాదాస్పద భాగాలను తొలగించి, నూతన మార్పులు చేయనున్నట్లు సమాచారం.

## ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభం

**మొదటిపేజీ తరువాయి..** మొత్తం 1,495 కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. విద్యార్థుల సంఖ్య: దాదాపు 9.97 లక్షల మంది విద్యార్థులు ఈ ఏడాది పరీక్షలకు హాజరవుతున్నారు. ఉదయం 9 గంటలకే పరీక్షలు ప్రారంభం కావడంతో, విద్యార్థులు ముందుగానే కేంద్రాలకు చేరుకున్నారు. నిబంధనల ప్రకారం సిబ్బంది క్షుణ్ణంగా తనిఖీలు చేసిన తర్వాతే లోపలికి అనుమతించారు. విద్యార్థుల సౌకర్యార్థం ఇంటర్ బోర్డు కొన్ని కీలక సడలింపులు ఇచ్చింది. వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకున్న హాల్‌టికెట్ ఉంటే పరీక్షకు అనుమతిస్తారు. హాల్‌టికెట్‌పై కళాశాల ప్రిన్సిపాల్ సంతకం లేకపోయినా విద్యార్థులను అడ్డుకోవద్దని అధికారులు స్పష్టం చేశారు.

అదనపు గుర్తింపు కార్డులు ఏవీ అవసరం లేదని, కేవలం హాల్‌టికెట్ ఉంటే సరిపోతుందని తెలిపారు. మూల్యాంకనం మరియు ఫలితాలు: పరీక్షలు జరుగుతుండగానే సమాధాన పత్రాల దిద్దుబాటు (వాల్యూయేషన్) ప్రక్రియకు బోర్డు షెడ్యూల్ విడుదల చేసింది: మార్చి 4: సంస్కృతం పేపర్ల మూల్యాంకనం ప్రారంభం. మార్చి 15 నుండి 20 మధ్య: మూడు విడతల్లో మిగిలిన సబ్జెక్టుల మూల్యాంకనం జరుగుతుంది. ఫలితాలు: అన్ని ప్రక్రియలు పూర్తి చేసి ఏప్రిల్ రెండో వారంలో ఫలితాలను విడుదల చేసేందుకు ఇంటర్ బోర్డు కసరత్తు చేస్తోంది.

## జగద్గిరిగుట్టలో 14 తులాల బంగారం అపహరణ

### పక్కా ఆధారాలతో నిందితుడి అరెస్టు

**హైదరాబాద్, ఫిబ్రవరి25 :** బయటకు వెళ్తూ ఇంటి తాళం చెవిని దాచిన చోటే దొంగకు దొరకడంతో.. పని సులువైందనుకున్నాడో దొంగ. అదను చూసి ఇంట్లోకి ప్రవేశించి 14 తులాల బంగారు ఆభరణాలను దోచి ఉడాయించాడు. ఈ ఘటన జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎల్లమ్మబండలో వెలుగుచూసింది. జగద్గిరిగుట్ట డిటెక్టివ్ ఇన్ స్పెక్టర్ నరేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లమ్మబండ దత్తాత్రేయ కాలనీకి చెందిన రేకపల్లి లక్ష్మి (63) ఈ నెల 23న సాయంత్రం 4.30 గంటల సమయంలో ఇంటికి తాళం వేశారు. ఆ తాళం చెవిని తలుపు పక్కనే ఉన్న డ్రమ్ కింద దాచి బయటకు వెళ్లారు. అయితే ఆమె తాళం దాస్తున్న విషయాన్ని అదే కాలనీకి చెందిన పత్రో శంకర్ (36) గమనించాడు. ఆమె వెళ్లగానే నిందితుడు డ్రమ్ కింద ఉన్న తాళంతో తలుపులు తీసి లోపలికి ప్రవేశించాడు. టీవీ టేబుల్‌పైనే ఉన్న అల్మారా తాళం చెవులతో లాకర్‌ను తెరిచి అందులోని సుమారు 14 తులాల బంగారు నగలను దొంగిలించి పరారయ్యాడు. అదే రోజు సాయంత్రం 6 గంటల ప్రాంతంలో ఇంటికి చేరుకున్న లక్ష్మి దంపతులు, అల్మారా తెరిచి ఉండటం చూసి ఆందోళన చెందారు. నగలు పోయినట్లు గుర్తించి వెంటనే జగద్గిరిగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు విశ్వసనీయ సమాచారం మేరకు, సాంకేతిక ఆధారాల లతో నిందితుడు పత్రో శంకర్‌ను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నిందితుడు దొంగతనం విషయమై అంగీకరించాడు. అతని వద్ద నుంచి ఒక బంగారు హారం, నల్లపూసల గొలుసు, మూడు పొరల గొలుసు, లాకెట్ ఉన్న గొలుసు, నాలుగు ఉంగరాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

## సిఐడి నుంచి సైబరాబాద్‌కు రెండు జాగిలాలు

## 18కి చేరిన జాగిలాల సంఖ్య

**హైదరాబాద్, ఫిబ్రవరి25 :** తెలంగాణ రాష్ట్ర సిఐడి నుంచి రెండు పోలీస్ కేనైన్‌లు సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌కు రిపోర్ట్ చేసినట్లు సిఎస్‌డబ్ల్యూ హెడ్‌క్వార్టర్స్ ఏడీసీపీ హనుమంతరావు తెలిపారు. ఈ రెండు కేనైన్‌లతో కలిపి ప్రస్తుతం సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పనిచేస్తున్న పోలీస్ జాగిలాల మొత్తం సంఖ్య 18కి చేరిందన్నారు. వీటిలో పేలుడు పదార్థాల గుర్తింపుకు 12, మాదకద్రవ్యాల గుర్తింపుకు 2, ట్రాకర్ జాగిలాలు 4 ఉన్నాయని చెప్పారు. సిఐడి నుంచి రిపోర్ట్ చేసిన కేనైన్‌లలో 'రానా' (బెల్జియన్ మాలినోయిస్, 4 ఏళ్లు), 'రాడో' (లాబ్రడార్, 10 ఏళ్లు) ఉన్నాయని వెల్లడించారు. నేరాల ఛేదన, పేలుడు పదార్థాల గుర్తింపు, ట్రాకింగ్ వంటి కీలక విధుల్లో ఈ కేనైన్‌లు ముఖ్య పాత్ర పోషిస్తున్నాయని ఏడీసీపీ తెలిపారు. బీడీ టీం ఆర్ఐ నాగరాజు సారథ్యంలో, ఆర్ఎస్ఐ వెంకటేష్ సహకారంతో ఈ కేనైన్‌ల సేవలు మరింత సమర్థంగా వినియోగంలోకి వస్తాయని పేర్కొన్నారు. పోలీస్ కేనైన్‌లను విధుల ప్రకారం విభజించారని తెలిపారు. పేలుడు పదార్థాల గుర్తింపు కేనైన్‌లు ప్రముఖుల కార్యక్రమాలు, ప్రజా ప్రతినిధుల సమావేశాలు, యాంటీ సబోటాజ్ చెకింగ్, బెదిరింపు కాల్స్ వంటి సందర్భాల్లో ఉపయోగపడుతున్నాయని వివరించారు. ట్రాకర్ కేనైన్‌లు నిందితులను గుర్తించడం, మిస్సింగ్ వ్యక్తులు లేదా వస్తువులను వెతకడం, సాక్ష్యాలు కనుగొనడంలో దర్యాప్తుకు సహాయపడుతున్నాయన్నారు. నార్కోటిక్ కేనైన్‌లు గంజాయి, కొకైన్, మెతాంఫెటమైన్, ఓపియం, ఎండీఎంఎ, హెరాయిన్ వంటి మాదకద్రవ్యాలను గుర్తించడంలో కీలకంగా పనిచేస్తున్నాయన్నారు. సైబరాబాద్ పోలీస్ కే9 స్క్వాడ్ విభాగం జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీల్లో కూడా ప్రతిభ చాటుతోందని తెలిపారు. నార్కోటిక్ కేటగిరీకి చెందిన కేనైన్ 'తేజ' 2024-25లో రాంచీలో జరిగిన 68వ ఆల్ ఇండియా పోలీస్ డ్యూటీ మీట్‌లో కాంస్య పతకం సాధించడంతో పాటు, హైదరాబాద్‌లో జరిగిన తెలంగాణ పోలీస్ డ్యూటీ మీట్‌లో కూడా కాంస్య పతకం గెలుచుకుందన్నారు. పేలుడు పదార్థాల గుర్తింపు కేటగిరీకి చెందిన కేనైన్ 'రీనా' తెలంగాణ పోలీస్ డ్యూటీ మీట్ 2024లో హైదరాబాద్‌లో, అలాగే 2025లో వరంగల్‌లో జరిగిన పోటీల్లో కాంస్య పతకాలు సాధించిందని పేర్కొన్నారు. బ్రీడ్‌ల వారీగా లాబ్రడార్ బ్రీడ్‌కు చెందిన కేనైన్‌లు ఎక్కువగా ఉండగా, డోబర్‌మాన్, బెల్జియన్ మాలినోయిస్ బ్రీడ్‌ల కేనైన్‌లు కూడా సేవలందిస్తున్నాయి. లాబ్రడార్ బ్రీడ్ కెనడా మూలాలు కలిగి బ్రిటన్‌లో అభివృద్ధి చెందినదిగా, డోబర్‌మాన్ జర్మనీకి చెందినదిగా, బెల్జియన్ మాలినోయిస్ బెల్జియంకు చెందిన ప్రత్యేక శిక్షణ బ్రీడ్ అని తెలిపారు.

## యూట్యూబర్ అన్వేష్ పై లుకౌట్ నోటీసులు

### విదేశాల్లో ఉండడంతో పంజాగుట్ట పోలీసుల వెల్లడి

**హైదరాబాద్, ఫిబ్రవరి25 :** యూట్యూబర్ అన్వేష్ పై పంజాగుట్ట పోలీసులు లుకౌట్ నోటీసులు జారీ చేశారు. ఇటీవల ఆయన విడుదల చేసిన ఒక వీడియోలో అసభ్యకరమైన పదజాలాన్ని ఉపయోగించినట్లు ఆరోపణలు రావడంతో పోలీసులు ఈ చర్యలు తీసుకున్నారు. సోషల్ మీడియా వేదికగా చేసిన ఆ వ్యాఖ్యలు సమాజంలో వివాదాస్పదంగా మారడంతో కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. ఈ వ్యవహారంపై స్పందించిన పంజాగుట్ట పోలీస్ అధికారులు, అన్వేష్ చేసిన వ్యాఖ్యలు చట్టపరంగా అభ్యంతరకరంగా ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం ఆయన విదేశాల్లో ఉండడంతో దేశంలోకి ప్రవేశించిన వెంటనే అదుపులోకి తీసుకునేలా లుకౌట్ నోటీసులు జారీ చేశారు. ఇటీవల అన్వేష్ తన సోషల్ మీడియా ద్వారా వీడియో విడుదల చేసి.. తనకు రెండు ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్లు, రెండు యూట్యూబ్ ఛానల్స్ ఉన్నాయని వెల్లడించారు. ఇందులో ఆయన ప్రధాన అకౌంట్‌ను ఇన్‌స్టాగ్రామ్ బ్లాక్ చేసినట్లు తెలిసింది. దీనిపై కూడా పోలీసులు దృష్టి సారించారు. ఈ కేసు దర్యాప్తు భాగంగా, అన్వేష్‌కు సంబంధించిన అకౌంట్ల వివరాలు, వీడియోల సమాచారం అందించాలని యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్ సంస్థలకు పోలీసులు అధికారికంగా లేఖ రాయనున్నట్లు తెలిపారు. సోషల్ మీడియాలో చట్టవిరుద్ధ కంటెంట్‌పై కఠిన చర్యలు తీసుకుంటామని, ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన పరిణామాలు తప్పవని అధికారులు హెచ్చరించారు.

## మెడికల్ కాలేజీల్లో 607 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీ

**హైదరాబాద్, ఫిబ్రవరి25 :** ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో 607 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీ చేయనున్నారు. ఈ మేరకు మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు..అభ్యర్థుల వివరాలు విడుదల చేసింది. ఈ నెల 28వ తేదీ వరకూ అభ్యంతరాల స్వీకరణకు గడువు విధించారు. అభ్యంతరాల పరిశీలన అనంతరం మెరిట్ లిస్ట్ విడుదల చేయనున్న బోర్డు. మార్చి చివరి నాటికి ఉద్యోగాల్లో చేరనున్న కొత్త అసిస్టెంట్ ప్రొఫెసర్లు అని పేర్కొంది.

## ఇంటర్ పరీక్షలకు సైబరాబాద్ పోలీసుల పటిష్ట బందోబస్తు

ప్రత్యేక పోలీస్ బృందాలతో విద్యార్థులకు సహకారం

**హైదరాబాద్, ఫిబ్రవరి25 :** ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభమైన నేపథ్యంలో సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పరీక్షల నిర్వహణకు, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద ట్రాఫిక్ నియంత్రణతో పాటు ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేసి విద్యార్థులకు అవసరమైన సాయం అందిస్తున్నారు. జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో మొత్తం 11 పరీక్షా కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ప్రతి కేంద్రం వద్ద పోలీస్ సిబ్బందిని నియమించి భద్రతా ఏర్పాట్లు చేశారు. ఆలస్యంగా వచ్చిన విద్యార్థులు లేదా తప్పుడు అడ్రస్‌తో వేరే కేంద్రానికి చేరుకున్న వారిని వెంటనే గుర్తించి, పోలీస్ వాహనాల ద్వారా సంబంధిత పరీక్షా కేంద్రాలకు చేర్చారు. ఇప్పటివరకు దాదాపు నలుగురు విద్యార్థులను సైబరాబాద్ పోలీసులు సరైన పరీక్షా కేంద్రాలకు చేర్చారు. పరీక్షల బందోబస్తును పరిశీలించేందుకు కుత్బుల్లాపూర్ ఏసీపీ బాల గంగిరెడ్డి కేంద్రాలను సందర్శించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కట్టుదిట్టమైన భద్రతతో పాటు సహాయక చర్యలు కొనసాగించాలని సిబ్బందిని ఆదేశించారు. ఇంటర్ పరీక్షల సందర్భంగా పేట్‌బషీరాబాద్ ఇన్‌స్పెక్టర్ విజయ్ వర్ధన్ బందోబస్తు సిబ్బందిని సమీక్షించి, పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. పోలీసుల తక్షణ సాయానికి విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

## జిల్లాలో సజావుగా ఇంటర్ పరీక్షలు..

### పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్

**విజయవాడ, ఫిబ్రవరి25 :** ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ఈ నెల 23వ తేదీన ప్రారంభమై జిల్లా వ్యాప్తంగా ప్రశాంత వాతావరణంలో సజావుగా కొనసాగుతున్నాయి. పరీక్షల మొదటి రోజు నుంచే విద్యార్థులు సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకుని, ఉత్సాహంగా పరీక్షలు రాస్తున్నారు. జిల్లావ్యాప్తంగా అన్ని కేంద్రాల్లో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టడంతో పాటు, అవసరమైన మౌలిక వసతులు సమకూర్చినట్లు అధికారులు తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ బుధవారం నగరంలోని ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో, నిబంధనల మేరకు జరుగుతున్నాయా అనే అంశాలను స్వయంగా పరిశీలించారు. పరీక్షా కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాల పనితీరు, సరైన విధంగా హాజరు నమోదు, ఇన్విజిలేటర్ల విధుల నిర్వహణ తదితర అంశాలను సమగ్రంగా సమీక్షించారు. పరీక్షా హాళ్లలో విద్యార్థులు సౌకర్యవంతంగా పరీక్ష రాయడానికి తగిన డెస్కులు, లైటింగ్, ఫ్యాన్లు, తాగునీటి సదుపాయం, ఫస్ట్ ఎయిడ్ వంటి ఏర్పాట్లు ఉన్నాయా అని పరిశీలించారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు, సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షణ కొనసాగుతోంది. ప్రశ్నపత్రాల రవాణా, భద్రపరచడం వంటి అంశాల్లో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నారు. విద్యార్థులకు తాగునీరు, విద్యుత్ సరఫరా, ఫ్యాన్లు, ప్రథమ చికిత్స సదుపాయాలు అందుబాటులో ఉంచినట్లు అధికారులు వెల్లడించారు. పరీక్షలు పూర్తయ్యే వరకు ఇదే క్రమశిక్షణతో, పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ లక్ష్మీశ ఈ సందర్భంగా అధికారులకు సూచించారు. జిల్లా వ్యాప్తంగా 36,928 మంది మొదటి సంవత్సరం విద్యార్థులు, 39,980 మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మొత్తం 76,908 మంది విద్యార్థులకు 98 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 9 గం. నుంచి మధ్యాహ్నం 12 గం. వరకు పరీక్షలు జరుగుతున్నాయి. జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాధికారి బి.ప్రభాకరరావు పరీక్షల నిర్వహణను పర్యవేక్షిస్తూ సజావుగా జరిగేలా చూస్తున్నారు.

## బిఎస్ఎన్ఎల్ డైరెక్టర్ కక్కుర్తి

### ప్రయాగ్ రాజ్ పర్యటనలో వ్యక్తిగత పనులకు సిబ్బంది ఏర్పాట్లకు పురమాయించడంతో వైరల్

### షోకాజ్ నోటీస్ జారీచేసిన కేంద్రం

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి25 :** భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ సీనియర్ డైరెక్టర్ వివేక్ బంజల్ వివాదంలో చిక్కుకున్నారు. యూపీలోని ప్రయాగ్‌రాజ్ పర్యటనకు వెళ్లేందుకు ఆయన విస్తృత ఏర్పాట్లు చేసుకోవడం, ఇందుకు సంబంధించిన ఆయన చేసిన డిమాండ్లు వైరల్ కావడంతో కేంద్రం సీరియస్ అయింది. ఆయనకు షోకాజ్ నోటీసు జారీ చేసింది. వారం రోజుల్లోగా వివరణ ఇవ్వాలని ఆదేశించింది. ఈ వ్యవహారం తమకు దిగ్భ్రాంతి కలిగించిందని, ఇదెంతమాత్రం ఆమోదయోగ్యం కాదని కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా తెలిపారు. అధికారి వివరణ తర్వాత తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. షెడ్యూల్ ప్రకారం వివేక్ బంజాల్ ఈనెల 25-26 తేదీల్లో ప్రయాగ్‌రాజ్ పర్యటనకు ఏర్పాట్లు చేసుకున్నారు. ఆయన పర్యటనకు ఏర్పాట్లు చేయాలని డిప్యూటీ మేనేజర్ స్థాయి కార్యాలయం నుంచి ఆదేశాలు వెళ్లాయి. సుమారు 50 మంది బీఎస్ఎన్ఎల్ సిబ్బందిని కేటాయించాలని ఆ ఆదేశాల్లో పేర్కొన్నారు. సిబ్బందికి 20 పనులు కూడా కేటాయించారు. ప్రయాగ్‌రాజ్‌లో అడుగుపెట్టగానే సంగమంలో స్నానం, పడవపై విహారం, హనుమాన్ మందిరం, అక్షయ్ వాత్, పాటల్పురి

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక



## ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్..

కామారెడ్డి: ఫిబ్రవరి 25 (జనసంఘర్షణ)

జిల్లాలో నేటి నుండి ప్రారంభమైన ఇంటర్ ప్రథమ సంవత్సరం వార్షిక పరీక్షల సందర్భంగా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను బుధవారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. పరీక్షా కేంద్రంలో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, ప్రశ్నాపత్రాల భద్రత, సీసీ కెమెరాల పర్యవేక్షణ, విద్యార్థుల హాజరు శాతం,హాల్ టికెట్ల తనిఖీ తదితర అంశాలను ఆయన పరిశీలించారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో, నిబంధనల ప్రకారం సజావుగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్షలు రాయడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద తగిన భద్రతా ఏర్పాట్లు చేయాలని, మాల్ప్రాక్టీస్‌కు ఆస్కారం లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, విద్యార్థులు మొబైల్ ఫోన్లు పరీక్ష కేంద్రాలకు తీసుకురాకుండా చూడాలని, సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని స్పష్టం చేశారు. కలెక్టర్ వెంట ఇంటర్మీడియట్ అధికారి , తహసిల్దార్ హిమబిందు, ప్రిన్సిపల్, తదితరులు ఉన్నారు. జిల్లా పౌర



సంబంధాల అధికారిణి కామారెడ్డి జిల్లా గారిచే జారీ చేయనైనది.

## బంజారా జాతి బిడ్డ సునీల్ నాయక్‌పై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అణచివేత

- తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన బిఆర్ఎస్ యువజన నాయకులు

భద్రాద్రి కొత్తగూడెం. ఇల్లెందు ప్రతినిధి. (జన సంఘర్షణ )

బంజారా జాతికి చెందిన ప్రతిభావంతుడు, నీతి-నిజాయితీ గల యువ అధికారి సునీల్ నాయక్‌పై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను బంజారా సమాజం తీవ్రంగా ఖండిస్తోంది. సామాన్య కుటుంబంలో జన్మించి, అరకొర వసతుల మధ్య చదువుకుంటూ, ఎన్నో ఆర్థిక సామాజిక ఇబ్బందులను ఎదుర్కొంటూ తన ప్రతిభతో ఉన్నత స్థానానికి చేరుకున్న వ్యక్తిని రాజకీయ కక్షలతో లక్ష్యంగా చేసుకోవడం అమానుషమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామీణ వాతావరణంలో పెరిగి, విద్య కోసం అనేక కష్టాలు అనుభవించిన సునీల్ నాయక్, తన కృషి, పట్టుదలతో ఎదిగి బంజారా యువతకు ఆదర్శంగా నిలిచారు. వెనుకబడిన వర్గాల నుంచి వచ్చిన యువతకు ఆయన ప్రయాణం ఒక స్ఫూర్తిదాయక కథగా నిలిచింది. అలాంటి వ్యక్తిని అనవసర ఆరోపణలు, ఒత్తిళ్లు, పరిపాలనా చర్యల పేరుతో అణగదొక్కాలని చూడటం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని నాయకులు పేర్కొన్నారు.మా జాతిలో ఎన్నో అవరోధాలు, అణచివేతలు ఎదుర్కొంటూ కష్టపడి ఎదిగిన ఒకరు ఇద్దరు అధికారులను కూడా రాజకీయ ప్రయోజనాల కోసం ఇబ్బందులకు గురిచేయడం సరైంది కాదు. సునీల్ నాయక్‌పై



తీసుకుంటున్న చర్యలు కక్షపూరితంగా కనిపిస్తున్నాయి. ప్రభుత్వం వెంటనే ఈ చర్యలను పునఃపరిశీలించి న్యాయం చేయాలి" అని వారు డిమాండ్ చేశారు. బంజారా సమాజ గౌరవం, స్వాభిమానానికి భంగం కలిగించే ఏ చర్యనైనా తాము సహించబోమని స్పష్టం చేశారు. నిజాయితీగా పనిచేస్తున్న అధికారులను రక్షించడం ప్రభుత్వ బాధ్యత అని గుర్తుచేశారు. సునీల్ నాయక్‌పై తీసుకున్న చర్యలను తక్షణమే ఉపసంహరించుకోవాలని, లేకపోతే బంజారా సమాజం పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలకు దిగుతుందని హెచ్చరించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ యువజన నాయకులు భూక్యా సురేష్ నాయక్ మాట్లాడుతూ, "సునీల్ నాయక్ మా జాతి గర్వకారణం. ఆయనపై జరుగుతున్న అన్యాయాన్ని మేము చూస్తూ ఊరుకోము. ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికి సమాన న్యాయం ఉండాలి. ప్రభుత్వం వెంటనే స్పందించి న్యాయం చేయాలి" అని పేర్కొన్నారు. సమాజంలో వెనుకబడిన వర్గాల ప్రతిభను ప్రోత్సహించాల్సిన సమయంలో, వారిని నిరుత్సాహపరిచే విధంగా వ్యవహరించడం బాధాకరమని బంజారా నాయకులు అభిప్రాయపడ్డారు. సునీల్ నాయక్‌కు పూర్తి మద్దతు ప్రకటిస్తూ, అవసరమైతే న్యాయపరమైన పోరాటం కూడా కొనసాగిస్తామని తెలిపారు.

## విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి

- జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్..

రాజంపేట : ఫిబ్రవరి 25 (జన సంఘర్షణ)

విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో చదువులో ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. బుధవారం రాజంపేట మండలం కొండాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన పరిశీలించారు. భోజన నాణ్యత, పరిశుభ్రత ప్రమాణాలను తనిఖీ చేసి, 10వ తరగతి విద్యార్థులతో మాట్లాడి భోజనం పై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. విద్యార్థులతో ప్రత్యక్షంగా మమేకమై తరగతి గదిలో 10 వ తరగతి విద్యార్థులతో కలిసి లెక్కల ప్రక్రియ (గణిత సమస్యలు) చేయించి వారి అవగాహన స్థాయిని తెలుసుకున్నారు. విద్యార్థుల ప్రతిభను అభినందిస్తూ, గణితం పై ఆసక్తి పెంపొందించుకోవాలని సూచించారు. సమస్యలను సులభంగా పరిష్కరించే పద్ధతులను వివరించి, నిరంతర అభ్యాసం ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని ప్రోత్సహించారు. విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో చదువులో ముందుకు సాగాలని, ఉపాధ్యాయులు కూడా విద్యార్థులకు బోధనలో నూతన పద్ధతులను అవలంబించాలని కలెక్టర్



సూచించారు. అలాగే, సి.ఎస్.ఆర్ ఫౌండేషన్ సహకారంతో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని కలెక్టర్ ప్రారంభించారు. విద్యార్థులు పఠనం పై ఆసక్తి పెంపొంది ంచుకోవాలని, గ్రంథాల యాన్ని సమర్థవ ంతంగా వినియోగిం చుకోవాలని సూచించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన కోడింగ్ ,రోబోటిక్స్ విభాగాల్లో విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులను పరిశీలించి వారిని అభినందించారు. సాంకేతిక విద్యలో ముందంజలో ఉండాలని ప్రోత్సహించారు. పాఠశాల వసతులు, బోధన విధానం, తరగతి గదుల నిర్వహణ తదితర అంశాలను సమీక్షించి, విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) రాజు , మండల విద్యాధికారి పూర్ణచంద్రరావు , మండల ఎండీఓ బాలకృష్ణ , పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర , ఉపాధ్యాయ బృందం , ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

- నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలి
- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్..

రాజంపేట: ఫిబ్రవరి 25 (జనసంఘర్షణ)

జిల్లాలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఇళ్ల నిర్మాణ పనుల పురోగతిని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పరిశీలించారు. బుధవారం రాజంపేట మండలం కొండాపూర్ లో లబ్ధిదారులు నిర్మించుకుంటున్న సంబంధిత గ్రామాన్ని సందర్శించి నిర్మాణంలో ఉన్న ఇళ్ల పనుల తీరును సమీక్షించారు. ఈ సందర్భంగా ఇంటిని నిర్మించుకుంటున్న లబ్ధిదారులతో జిల్లా కలెక్టర్ మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకుని నాణ్యమైన నిర్మాణం చేపట్టాలని సూచించారు. ఇళ్ల నిర్మాణం వేగవంతంగా పూర్తి చేసి, నిర్ణీత గడువులోగా లబ్ధిదారులకు గృహప్రవేశం జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా



పారదర్శకంగా పనులు నిర్వహించాలని స్పష్టం చేశారు. అవసరమైన నిర్మాణ సామగ్రి, సాంకేతిక సహాయం లభ్యమయ్యేలా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట పిడి హౌసింగ్ విజయపాల్ రెడ్డి, ఎంపీడీవో బాలకృష్ణ, మండల ప్రత్యేక అధికారి అపర్ణ, గ్రామ సర్పంచ్ కీసరి కృష్ణ, పంచాయతీ కార్యదర్శి శ్రీజ, ఇంజనీరింగ్ అధికారులు, ఆయా శాఖ అధికారులు తదితరులు ఉన్నారు.

## పోచమ్మ విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం

బోధన్ : ఫిబ్రవరి 25 జన సంఘర్షణ






బోధన్ మండలంలోని ఊటుపల్లి గ్రామంలో పెద్ద పోచమ్మ విగ్రహ ప్రతిష్టాపనోత్సవం గ్రామస్తులు బుధవారం రోజున నిర్వహించారు. సోమవారం ఉదయం పోచమ్మ విగ్రహ ఊరేగింపు, అలాగే హోమము, అన్నదానం తదితర తదితర గ్రామస్తులు నిర్వహించారు. అనంతరం గ్రామస్తులు మాట్లాడుతూ.... గ్రామంలో పాత పోచమ్మ సిమెంటు విగ్రహంతో ఉండడంతోపాటు వాటి స్థానంలో కొత్త నూతన రాతి విగ్రహ ప్రతిష్టాపన ఉత్సవం నిర్వహించామని గ్రామస్తులు పేర్కొన్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులకు సన్మానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ ఆడపడుచులు, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ అవగాహన సదస్సు

బోధన్ : ఫిబ్రవరి 25 ( జన సంఘర్షణ )




బోధన్ పట్టణంలోని బాబా గార్డెన్ వద్ద టూ వీలర్ , ఫోర్ వీలర్ వాహనదారులకు ఆపి బుధవారం అవగాహన కార్యక్రమం పట్టణ సీఐ వెంకటనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... మద్యం సేవించి వాహనాలు నడపకూడదు, అలాగే నడిపితే తగు చర్యలు తీసుకుంటామని అన్నారు. ఫోర్ వీలర్ కచ్చితంగా సీట్ బెల్ట్ పెట్టుకోవాలని ఉద్దేశించి అన్నారు. ఈ కార్యక్రమం లో ట్రాఫిక్ ఆర్ఐ వినోద్, ఎస్ఐ మహేష్ మరియూ సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో బోధన్ పట్టణ సీఐ వెంకట నారాయణ, ట్రాఫిక్ ఆర్ఐ వినోద్, ఎస్ఐ మహేష్, సిబ్బంది పాల్గొన్నారు.

## బోధన్ పట్టణంలో ఇంటర్ పరీక్షలు ప్రశాంతం

బోధన్ : ఫిబ్రవరి 25 జన సంఘర్షణ

బోధన్ పట్టణంలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. పట్టణంలో తొమ్మిది పరీక్షా కేంద్రాలలో సుమారు మూడు వేల మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. ఉదయం 9 నుండి 12 గంటల వరకు పరీక్షలు జరుగుతున్నాయి. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉదయం 9:05 వరకు గ్రేస్ పీరియడ్ కేటాయించారు. పోలీసులు పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులను తప్ప ఎవరినీ అనుమతించడం లేదు. కొందరు విద్యార్థులకు అధికారులు వీల్ చైర్ సహాయం అందించారు.



## ఇంటర్ పరీక్షలకు 576 మంది గైర్హాజరు

బోధన్: ఫిబ్రవరి 25 జన సంఘర్షణ



నిజామాబాద్ జిల్లాలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు అత్యంత పకడ్బందీగా, ప్రశాంత వాతావరణంలో ప్రారంభ మయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 19,150 , 2 18,574(97%) హాజరయ్యారు. పరీక్షల నిర్వహణలో ఎక్కడా లోపాలు తలెత్తకుండా హైపవర్ కమిటీ, సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు నిరంతరం పర్యవేక్షించారు.

# ప్రైవేట్ రవాణా కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి...

హైదరాబాద్ బ్యూరో ఫిబ్రవరి25 ( జనసంఘర్షణ)

ఈరోజు తెలంగాణలో వివిధ జిల్లాలలో భారతీయ మజ్దూర్ సంఘ్ పిలుపు మేరకు కలెక్టర్ కార్యాలయాల వద్ద విరోద్ ప్రదర్శన నిర్వహించి ఆటో మరియు ప్రైవేట్ రవాణా కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్లకు రవాణా శాఖ కమిషనర్ కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో భారతీయ ప్రైవేట్ ట్రాన్స్ పోర్ట్ మజ్దూర్ మహా సంఘ్ అఖిల భారత ప్రధాన కార్యదర్శి రవిశంకర్ అల్లూరి, ఉపాధ్యక్షులు నంద కిషోర్, కార్యదర్శి యండి హబీబ్, ఆటో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి పెంటయ్య గౌడ్, వజ్ర లింగం, శంకర్, శివకుమార్, మహా సంఘ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శ్రీధర్, అఖిల భారత మహిళా ప్రభారి శ్రీమతి మీనా తదితరులు పాల్గొన్నారు.. తెలంగాణ రాష్ట్రంలో గత రెండు సంవత్సరాలుగ ఆటో, ప్రైవేట్ రవాణా కార్మికుల సమస్యలు అధికమవుతున్నాయి. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తో ఆటో డ్రైవర్లు ఆర్థిక ఇబ్బందులు పడి ప్రాణాలు కోల్పోతుంటే, రాష్ట్ర ప్రభుత్వం క్రొత్త ఆటో పర్మిట్లు విడుదల చేసి అక్రమార్కులను దళారులను , షోరూం యజమానులను పెంచి పోషిస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వం ఆటో, ప్రైవేట్ రవాణా కార్మికులకు ఇచ్చిన వాగ్దానాలను అటకెక్కించింది. పుండుపై కారం చల్లిన విధంగా కొంతమంది వ్యక్తులు నాన్ కమర్షియల్ వెహికల్స్ అయిన ఓలా, ఊబర్, ర్యాపిడో బైకులు అక్రమ వ్యాపారం చేస్తూ ఆటో, క్యాబ్ డ్రైవర్ల వ్యాపారాన్ని దెబ్బ తీస్తున్న ప్రభుత్వం చోద్యం చూస్తున్నది. ఆటో ప్రైవేట్ రవాణా డ్రైవర్ల సంక్షేమం మరచిన ప్రభుత్వం ఇప్పటికైనా ఆటో మరియు ప్రైవేట్ రవాణా సంఘాలతో చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాలలో భారతీయ మజ్దూర్ సంఘ్ ఆధ్వర్యంలో విరోధి ప్రదర్శన నిర్వహించడం జరిగింది. అనంతరం మా సమస్యలను మీ దృష్టికి తీసుకురావడం జరుగుచున్నది. కావున తమరు మా సమస్యల పరిష్కారం కొరకు రాష్ట్ర ప్రభుత్వం తో చర్చలు జరిపించి పరిష్కరించాలని కోరుచున్నాము. లేని పక్షంలో మా ఆందోళ నను ఉధృతం చేస్తామనిబి. పి టీ ఏం ఏం జాతీయ ప్రధాన కార్యదర్శి రవిశంకర్ అల్లూరి ,



బి ఏం ఎస్ ఆటో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్య దర్శి బి.పెంటయ్య గౌడ్ తెలియ చేశారు.

**ఏప్రిల్ 16 ధర్నా డిమాండ్లు**

ప్రైవేట్ రవాణా కార్మికుల కొరకు సంక్షేమ బోర్డు వెంటనే ఏర్పాటు చేయాలి. రైల్వే స్టేషన్స్ లో ఆటో, ట్యాక్సీ, ఈ రిక్షాలకు యూనియన్ ద్వారా పార్కింగ్ సౌకర్యం కల్పించాలి. అక్రమంగా నడుస్తున్న ఓలా, ఊబర్, ర్యాపీడో బైకులను నిషేధించాలి. జాతీయ రహదారులపై డ్రైవర్ల కొరకు ప్రాథమిక చికిత్స కేంద్రాలు, సబ్సిడీ క్యాంటీన్లు, విశ్రాంతి గృహాలు ఏర్పాటు చేయాలి. ఆర్.టి.ఎ దళారుల ద్వారా జరుగుతున్న దోపిడీని అరికట్టాలి. వాహనాల స్క్రాప్ 15 సంవత్సరాల నుంచి 20 సంవత్సరాలు చేసి గ్రీన్ ట్యాక్స్ కూడా 20 సం:లకు ఇవ్వాలి. ప్రైవేట్ రవాణా వాహనాల కొనుగోలుకు డ్రైవర్ కు బ్యాంకుల ద్వారా ముద్ర లోన్ ఏర్పాటు చేయాలి. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి ఎయిర్ పోర్టు లో ఆటో, ట్యాక్సీలకు ఉచిత పార్కింగ్ సౌకర్యం ఏర్పాటు చేయాలి. ఐఆర్డీఏ ద్వారా పెంచిన కమర్షియల్ వాహనాల ఇన్సూరెన్స్ 50 శాతం తగ్గించాలి. రాష్ట్ర వ్యాప్తంగా డ్రైవర్ల కొరకు ఒక హెల్ప్ లైన్ నంబర్ కేటాయించాలి. ఆటో మీటర్ రేటు కనీసం 50/- చేయాలి. యాప్ ఆధారిత ఆన్ లైన్ సర్వీస్ చేసే కార్మికులకు, డ్రైవర్లకు కనీస వేతనం నిర్ణయించాలి. అగ్రికేటర్స్ కమిషన్ పేరున చేస్తున్న దోపిడీని అరికట్టాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అగ్రికేటర్స్ ను పిలిచి యూనియన్లతో జాయింట్ సమావేశాలు నిర్వహించి సమస్యలు పరిష్కరించాలి. యాప్ ఆధారిత గిగ్ ప్లాట్ ఫామ్ కార్మికులకు సామాజిక భద్రత చట్టం ద్వారా ప్రతి రాష్ట్రంలో బోర్డు ఏర్పాటు చేయాలి. ప్రమాద బీమా, సహజ బీమా, ఆరోగ్య బీమా ప్రతి డ్రైవర్ కు అందచేయాలి. ప్రభుత్వం ద్వారా ప్రతి గిగ్,ప్లాట్ ఫాం వర్కర్ కు గుర్తింపు కార్డు మంజూరు చేయాలి, పనిగంటలు నిర్ణయించాలి. యాప్ ఆధారిత డ్రైవర్లకు, కార్మికులకు పార్కింగ్ స్థలాలు కేటాయించి, షెల్టర్ నిర్మాణం చేయాలి.

# కందకుర్తి పుష్కర ఘాట్ ను సందర్శించిన కలెక్టర్





బోధన్ : ఫిబ్రవరి 25 జన సంఘర్షణ

రెంజల్ మండలంలోని కందకుర్తి పుష్కర ఘాట్ ను కలెక్టర్ ఇలా త్రిపాఠి బుధవారం సంబంధిత శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. వచ్చే ఏడాది 2027లో జరగనున్న గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని జిల్లాలోని ప్రధానమైన ఈ పుష్కర ఘాట్ ను క్షేత్రస్థాయిలో సందర్శించి, అందుబాటులో ఉన్న సౌకర్యాలను బుధవారం పరిశీలించారు. పుష్కర ఘాట్ పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడాన్ని గమనించిన కలెక్టర్ సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పుష్కరాల సమయంలోనే కాకుండా ఈ ప్రదేశానికి సాధారణ సమయాలలోనూ భక్తులు తరలివస్తారని, వారి సౌకర్యార్థం పరిసరాల పరిశుభ్రతతో పాటు కనీస సదుపాయాలు భక్తులకు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. గోదావరి పుష్కరాలకు ఈ ఘాట్ వద్ద వీ.వీ.ఐ.పీలు, లక్షలాదిగా భక్తులు పుణ్య స్నానాలకు తరలివచ్చే అవకాశాలు ఉన్నందున ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా వాహనాల పార్కింగ్, మరుగుదొడ్లు, తాత్కాలిక గదులు, భక్తులు బస చేసేందుకు వీలుగా తగిన వసతి, షామియానాలు వంటివి పక్కాగా అందుబాటులో ఉండాలన్నారు. భక్తులకు పూర్తి స్థాయిలో పటిష్ఠ భద్రత కలిగి ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. భక్తులు వంటలు చేసుకునేందుకు వీలుగా కిచెన్ షెడ్ నిర్మించాలని సూచించారు. పుష్కర ఘాట్ వద్ద మెట్లు, ఘాట్ వంటి వాటికి అవసరమైన మేర మరమ్మతులు చేయించాలని అన్నారు. ఘాట్ వద్ద ప్రమాదాలకు ఆస్కారం లేకుండా అన్ని జాగ్రత్తలు చేపట్టాలని, హైమాస్ లైట్లు ఏర్పాటు చేయాలని, రహదారికి మరమ్మతులు జరిపించాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ విజయరామారావు, సంబంధిత శాఖల అధికారులు ఉన్నారు.

## బోధన్ పట్టణంలోని ఆచన్‌పల్లి దోమల నివారణ

బోధన్ : ఫిబ్రవరి 25 జన సంఘర్షణ




బోధన్ పట్టణంలోని ఆచన్‌పల్లి 1వ వార్డులో బుధవారం దోమల నివారణ కోసం మాలాతీయన్ ద్రావణాన్ని పిచికారీ చేశారు. ఈ కార్యక్రమంలో జాదవ్ కృష్ణ (మున్సిపల్ కమిషనర్), తూము పద్మ శరత్ రెడ్డి (మున్సిపల్ చైర్‌పర్సన్), లక్ష్మీ శ్రీరామ్మూర్తి (కౌన్సిలర్) మరియు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. పట్టణంలో పెరుగుతున్న దోమల సమస్యను దృష్టిలో ఉంచుకుని ప్రజల ఆరోగ్య రక్షణ కోసం ఈ చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ప్రజలు తమ ఇళ్ల పరిసరాల్లో నిల్వ నీరు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కోసం మాలాతీయన్ ద్రావణాన్ని పిచికారీ చేశారు.

## రోడ్డు భద్రత వారోత్సవాలు వాహనదారులకు అవగాహన సదస్సు

హైదరాబాద్ సిటీ బ్యూరో / ఫిబ్రవరి 25 ( జనసంఘర్షణ )



జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్, ట్రాఫిక్, హైదరాబాద్ నగరంలో కమిషనర్ ఆదేశాల మేరకు. బుధవారం సాయంత్రం సమయంలో, చిక్కడపల్లి ట్రాఫిక్ పోలీసులు ఆర్టీసిఎక్స్ రోడ్డులో అరైవ్ అలైవ్ రోడ్ సేఫ్టీ ఫేజ్-2 కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో, హెల్మెట్ ధరించడం, సీటు బెల్టులు వాడటం, ఎడమ వైపు నుండి ఓవర్‌టేక్ చేయకుండా ఉండటం, రోడ్డుపై డ్రైవింగ్ చేసేటప్పుడు ట్రాఫిక్ నియమాలు మరియు భద్రతను పాటించడం వంటి వాటి ప్రాముఖ్యత గురించి ప్రయాణికులలో అవగాహన కల్పించారు. గౌరవపూర్వకంగా డెల్టా-09 చిక్కడపల్లి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్. సంయుక్తం లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

## రోడ్డుపైననే మురుగు పట్టించుకోని అధికారులు...

హైదరాబాద్ బ్యూరో ఫిబ్రవరి 25 (జనసంఘర్షణ )



అంబర్పేట నియోజకవర్గం లోని ప్రేమనగర్ డివిజన్ పలు ప్రాంతాల్లో మురికి నీరు ప్రవహిస్తుండడంతో స్థానిక ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. ప్రేమ్ నగర్ లోని రోడ్లపై గత కొన్ని రోజుల నుండి డ్రైనేజీ నీరు పారుతుండడంతో దగ్గర్లోని స్కూల్ ఉండడంతో విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురవుతున్నారు. పిల్లలు స్కూలుకు రావాలన్నా డ్రైనేజీ నీరుపై నడుచుకుంటూ రావాల్సి వస్తుంది. పిల్లలు ఉదయం పూట స్కూల్ యూనిఫామ్ లో వచ్చేటప్పుడు వారికి మురికి నీరు లో నుంచి నడవడంతో వారి యూనిఫామ్ బురదమయం అవుతుంది. స్థానిక కార్పొరేటర్ కు విన్నవించిన ఫలితం లేకుండా పోతుంది. స్థానిక ఎమ్మెల్యే ఈ బస్తీకి ఇంతవరకు రాలేదు. ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకుపోయిన పరిష్కారం కాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్థానిక ఎమ్మెల్యే ఓట్ల కోసం వచ్చి నప్పుడు చూసామంటే... ఇంతవరకు ఎమ్మెల్యేని చూడలేదని స్థానిక బస్తి ప్రజలు తెలిపారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే స్పందించి డ్రైనేజీ వ్యవస్థని బాగు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

## హిందువులపై దాడి చేసిన వారిని శిక్షించాలి: దినేష్ కులాచారి

జన సంఘర్షణ డెస్క్



రుద్రూర్, బాన్సువాడ, నిజామాబాద్లలో హిందువులపై దాడులు చేస్తున్న ముష్కరులను కఠినంగా శిక్షించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారి డిమాండ్ చేశారు. హైదరాబాద్లో రాష్ట్ర అధ్యక్షుడు రామ్ చందర్ రావుతో కలిసి డీజీపీ శివధర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. పోలీసుల నిర్లక్ష్యం వల్లే దాడులు జరుగుతున్నాయని, పక్షపాత ధోరణి వీడి నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలన్నారు.

# ఇంటర్ పరీక్షలకు విద్యార్థులకు ఇల్లందు మాజీ ఎమ్మెల్యే ఆల్ ద బెస్ట్

భద్రాద్రి కొత్తగూడెం. ఇల్లెందు ప్రతినిధి.ఫిబ్రవరి 25 (జన సంఘర్షణ )



తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నేటి నుండి జరగబోయే ఇంటర్ పరీక్షలకు ఇల్లందు నియోజక వర్గం నుండి పరీక్షల హాజరవుతున్న విద్యార్థినీ విద్యార్థులకు ఇల్లందు నియోజకవర్గ మాజీ శాసన సభ్యురాలు, ఇంచార్జ్ బానోత్ హరిప్రియ నాయక్ ఆల్ ది బెస్ట్ తెలియజేశారు... ఇంటర్మీడియట్ పరీక్షలకి సకాలంలో హాజరై మేధస్సుతో పరీక్షలను రాసి తల్లిదండ్రులకు ఇల్లందు నియోజకవర్గానికి మంచి గుర్తింపు తీసుకురావడంతో పాటు తమ ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ఇంటర్మీడియట్ విద్యార్థిని విద్యార్థులను మాజీ శాసన సభ్యురాలు, ఇంచార్జ్ భానోత్ హరిప్రియ నాయక్ కోరారు...

## బాణాపూర్ ఫీడర్ సమస్యను పది రోజుల్లో పూర్తి చేయాలి..

లింగంపేట్: ఫిబ్రవరి 25 (జనసంఘర్షణ)



బాణాపూర్ ఫీడర్ సమస్యను పది రోజుల్లో పూర్తి చేసివిద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ ఎస్సీ రవీందర్ రావు అధికారులకు సూచించారు. మండలంలోని బాణాపూర్ గ్రామంలో మంగళవారం విద్యుత్ సబ్స్టేషన్ ఎదుట గ్రామస్తులు ధర్నా నిర్వహించారు. విషయాన్ని తెలుసుకున్న ఆయన బుధవారం గ్రామాన్నిసందర్శించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలపై గ్రామస్తులతో మాట్లాడి విషయాన్ని తెలుసుకున్నారు. బాణాపూర్ ఫీడర్ పై నుండి బోనాల్, బాయంపల్లి గ్రామాలకు తొలగించాలని సూచించారు. గ్రామంలో త్రీఫేస్ విద్యుత్ సరఫరా చేయడానికి చేపట్టే పనులు పది రోజుల్లో పూర్తి చేయాలని అధికారులకు కాంట్రాక్టర్లకు ఆదేశించారు. విద్యుత్ సరఫరా లో ఇకముందు సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ఆయన వెంట డి ఈఈ విజయసారథి, ఏడిఈ మల్లేశం, ఏ ఈ హరీష్ తో పాటు గ్రామస్తులు ఉన్నారు.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక



## రెంజల్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసిన జిల్లా కలెక్టర్

బోధన్ : ఫిబ్రవరి 25 జన సంఘర్షణ



రెంజల్ మండలం కందకుర్తి పుష్కర ఘాట్ పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటాన్ని గమనించిన నిజామాబాద్ కలెక్టర్ ఇలా త్రిపాఠి సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఆమె కందకుర్తి పుష్కర ఘాట్ను సంబంధిత శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. గోదావరి పుష్కరాలకు లక్షలాదిగా భక్తులు పుణ్య స్నానాలకు తరలివచ్చే అవకాశాలు ఉన్నందున ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆమె ఆదేశించారు.

## పరీక్షకు ఆలస్యంగా వచ్చిన విద్యార్థిని.. నో ఎంట్రీ!

నిజామాబాద్ : ఫిబ్రవరి 25 జన సంఘర్షణ




నిజామాబాద్ సీఎస్ఐ పాఠశాల ఇంటర్ పరీక్షా కేంద్రంలో తొలిరోజే చేదు అనుభవం ఎదురైంది. ఐదు నిమిషాల సడలింపు నిబంధన ఉన్నప్పటికీ, అంతకంటే ఆలస్యంగా వచ్చిన ఒక విద్యార్థినిని అధికారులు లోపలికి అనుమతించలేదు. దీంతో ఆమె పరీక్ష రాయకుండానే వెనుదిరగాల్సి వచ్చింది. విద్యార్థులు కచ్చితంగా సమయపాలన పాటించాలని, ఆలస్యమైతే నిబంధనల ప్రకారం అనుమతించడం కుదరదని అధికారులు స్పష్టం చేశారు.

## ఇల్లందు-కొత్తగూడెం రహదారిపై రోడ్డు ప్రమాదం

భద్రాద్రి కొత్తగూడెం. ఇల్లెందు ప్రతినిధి. ఫిబ్రవరి 25( జన సంఘర్షణ )



ఇల్లందు-కొత్తగూడెం రహదారి మధ్యలో సుదిమల్ల స్టేజి వద్ద రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఇద్దరు మృతి, ఇద్దరికీ తీవ్ర గాయాలు. రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని పడిపోయిన వారిని వెనకనుంచి వచ్చి ఢీ కొట్టిన లారీదెబ్బతిన్నట్లు సమాచారం. ఘటన కారణంగా కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. స్థానికులు వెంటనే స్పందించి గాయపడిన వారిని సమీప ఆసుపత్రికి తరలించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను సక్రమంగా నిర్వహించారు. ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## కూకట్పల్లి అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

◆ **కూకట్పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్.**

హైదరాబాద్,కూకట్పల్లి ప్రతినిధి అంజిబాబు, ఫిబ్రవరి 25,( జన సంఘర్షణ ):



తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు కూకట్పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ మంగళవారం రోజు ఉదయం నియోజకవర్గం నాయకులు కార్యకర్తలతో కలిసి గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కోర్ అర్బన్ రీజియన్ లో భాగమైన నూతనంగా ఏర్పాటైన సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కు నూతన కమిషనర్‌గా నియమించబడిన గుమ్మల శ్రీజన ఐఏఎస్ ని మర్యాదపూర్వకంగా కలిసి కూకట్పల్లి నియోజకవర్గం పరిధిలోని సమస్యలు చేపట్టాల్సిన చర్యలపై అలాగే జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి సుదీర్ఘంగా కూలంకుషంగా చర్చించారు. కూకట్పల్లి కూడలి వద్ద రానున్న ఫ్లై ఓవర్... చెరువుల సుందరీకరణ జేఎన్టీయూ వద్ద రోడ్డు విస్తరణ ఫ్లై ఓవర్ ప్రణాళికలు అలాగే పలు అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన విషయాలపై చర్చించారు.సమావేశం అనంతరం కమిషనర్ మాట్లాడుతూ త్వరలో జోనల్ సర్కిల్ స్థాయిలో తమతో పాటు అధికారులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి ప్రతీ సమస్యకు పరిష్కారం లభించే విధంగా చర్యలు తీసుకుంటామని అలాగే అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

## ప్రోటోకాల్ పాటించకపోవడంపై సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత..

బీర్కూర్:ఫిబ్రవరి.25(జన సంఘర్షణ)



కామారెడ్డి జిల్లా బీర్కూరు మండలం బీర్కూరు గ్రామ ప్రథమ పౌరుడు అయిన తనకు అధికార కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, బీర్కూర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రోటోకాల్ పాటించకుండా అవమాన పరుస్తున్నారని బీర్కూర్ గ్రామ సర్పంచ్ అరిగే ధర్మ తేజ అన్నారు..బుధవారం బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయికి వినతి పత్రం అందజేశారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంగళవారం బీర్కూర్ గ్రామ శివారులో గల ప్రకాష్ రావు క్యాంపు నుండి తెలంగాణ తిరుమల దేవస్థానం వరకు సుమారు 60 లక్షల హెచ్ డి ఎఫ్ నిధులతో రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం స్థానిక ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ప్రారంభించారు..కాగా సర్పంచ్ కు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా, ఇతర గ్రామ సర్పంచ్ లతో కొబ్బరికాయలు కొట్టి రోడ్డు పనులు ప్రారంభించడం అధికార పార్టీ అహంకారానికి నిదర్శనం అన్నారు.. బీర్కూర్ గ్రామంలో అభివృద్ధి నిధులతో చేపట్టే పనులకు ప్రోటోకాల్ పాటించే విధంగా చర్యలు చేపట్టాలని వినతిపత్రంలో సబ్ కలెక్టర్ కు తెలియజేయడం జరిగిందన్నారు. అభివృద్ధికి అడ్డు తగలకూడదని ఉద్దేశంతో తాను అధికార పార్టీ నాయకులు ప్రశ్నించడం లేదని, దీనినే ఆసరాగా తీసుకొని ఒక గ్రామ ప్రథమ పౌరుడైన తనను చిన్నచూపు చూస్తే ఇకనుంచి సహించేది లేదంటూ ధర్మతేజ మీడియాతో మాట్లాడుతూ హెచ్చరించారు. ఎన్నికలు ఉన్నంతవరకే రాజకీయాలు, ఆ తర్వాత రాజకీయాలని పక్కనపెట్టి అభివృద్ధికి అందరూ కలిసికట్టుగా పని చేయవలసి ఉండగా, ఉద్దేశపూర్వకంగా తనపై కక్ష సాధింపు ధోరణి ఒక ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి తో పాటు ఆయన అనుచరులు చేయడం పట్ల గ్రామ సర్పంచ్ ధర్మతేజ తప్పు పట్టారు. ఇటీవల తెలంగాణ తిరుమల దేవస్థానంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలకు కూడా తనకు ఆహ్వానం అందించలేదని ధర్మతేజ ఆరోపించారు. ఇకనుంచి తన గ్రామానికి వస్తే ఏ అధికారైన, ఏ ఎమ్మెల్యే అయినా, మంత్రి అయినా కచ్చితంగా ప్రోటోకాల్ పాటించాలని లేని యెడల కార్యక్రమాలను అడ్డుకుంటామని ధర్మతేజ ఈ సందర్భంగా హెచ్చరించారు.

## అక్రమంగా తరలించడానికి నిలువ ఉంచిన పిడిఎస్ బియ్యంపై నిజామాబాద్ సిసిఎస్ టీం మెరుపు దాడి

◆ **వీటితో పాటు పలు ఉమ్మడి మండలాల్లో కోటగిరి పోతంగుల్లో విచ్చలేడుగా పిడిఎఫ్**



కోటగిరి: ఫిబ్రవరి.25 ( జన సంఘర్షణ)

నిజామాబాద్ జిల్లా పోలీస్ కమీషనర్ .సాయి చైతన్య, ఆదేశాల మేరకు సిసిఎస్ ఏ.సీ.పీ ఇంచార్జ్ మస్తాన్ ఆలి సూచనల మేరకు ఇన్స్పెక్టర్ డి.సాయినాథ్, ఎస్.ఐ గోవింద్, సిబ్బందితో కలిసి నిజామాబాద్ టౌన్- 1 పోలీస్ స్టేషన్ పరిధిలోని మిర్చి కంపౌండ్, కెనాల్ కట్ట, ఎరుకలవాడ నందు పిడిఎస్ బియ్యం ఉన్నాయన్న సమాచారం మేరకు షేక్ సాహెబ్ హుస్సేన్ ఇంట్లో సుమారు 40 కింటల్స్ పిడిఎస్ బియ్యము ఉన్నట్లు తెలుసుకొని మెరుపు దాడి చేశారు. పిడిఎస్ బియ్యం తరలించడానికి ఉపయోగించిన మహేంద్ర బుల్లోరో వాహనం సీజ్ చేయడం జరిగింది. సీజ్ చేసిన పిడియస్ బియ్యము, బొలెరో వాహనాన్ని నిజామాబాద్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్హెచ్ఓ తగు చర్య నిమిత్తం అప్పచెప్పడం జరిగింది.

## ఈరోజు పరీక్ష రాస్తున్న ఇంటర్ విద్యార్థులకు శుభాకాంక్షలు

◆ **ఒత్తిడి లేకుండా పరీక్షలు రాసి విజయం సాధించండి**

ఖమ్మం సింగరేణి. ప్రతినిధి. (జన సంఘర్షణ)



మీకు ఇచ్చిన టైం, కంటే ముందే పరీక్షల సెంటర్ దగ్గర కు తొందరగా బయలుదేరి వెళ్లాలని, హాల్ టికెట్ రెండు పెన్నులు తీసుకొని వెళ్లాలని, ఒత్తిడి లేకుండా పరీక్షలు రాసి విజయం సాధించండి. బుధవారం నుండి ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల నేపథ్యంలో విద్యార్థులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. ఎంతో కీలకమైన ఈ దశలో విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు హాజరు కావాలని ఆకాంక్షిస్తున్నాను. పరీక్షల సమయంలో విద్యార్థులు ఎటువంటి మానసిక ఒత్తిడికి లోనుకావద్దని తెలియజేస్తున్నాను. " పరీక్షలు రాసి మంచి విజయాన్ని సాధించాలని కోరుకుంటున్నాను. మీ శ్రమకు తగ్గ ఫలితం ఖచ్చితంగా లభిస్తుంది .ముఖ్యంగా విద్యార్థినీ, విద్యార్థులందరూ క్రమశిక్షణతో, ఏకాగ్రతతో పరీక్షలు రాసి ఉత్తమ మార్కులతో ఉత్తీర్ణులు కావాలని కోరుకుంటున్నారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, వారికి కావాల్సిన ప్రశాంత వాతావరణాన్ని కల్పించడంలో, ఉపాధ్యాయులు తోడ్పడాలని కోరుకుంటున్నాను. అందరికీ ఆల్ ద బెస్ట్

## రాష్ట్ర వ్యాప్తంగా తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాలకు శాశ్వత భవనాలు

◆ **ప్రజలకు గౌరవప్రదమైన సేవలే లక్ష్యం**

హైదరాబాద్ . ఫిబ్రవరి 25 . (జన సంఘర్షణ )




రాష్ట్రంలో ప్రజలకు మరింత సౌకర్యవంతమైన, పారదర్శకమైన పరిపాలన అందించాలనే లక్ష్యంతో తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాలకు శాశ్వత భవనాలు నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మొదటి దశలో అద్దె భవనాల్లో కొనసాగుతున్న 60 తహసీల్దార్ కార్యాలయాలు, 5 ఆర్డీవో కార్యాలయాలకు ఆధునిక సౌకర్యాలతో శాశ్వత భవనాలు నిర్మిస్తామని వెల్లడించారు. అలాగే రెండవ విడతలో శిథిలావస్థలో ఉన్న 170 ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాలను నిర్మిస్తామని వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని భవనాలు ఒకే నమూనాలో, ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా డిజైన్ చేయనున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో చర్చించి డిజైన్లకు తుది రూపు ఇస్తామని చెప్పారు. తక్కువ ఖర్చుతో ప్రజలకు అత్యుత్తమ సేవలు అందేలా ఈ భవనాల నిర్మాణం ఉంటుందన్నారు. బుధవారం సచివాలయంలో తన కార్యాలయంలో రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో ఎన్ని తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి, శిథిలావస్థ, పాలనకు అనువుగా లేని భవనాలు వివరాలను సేకరించారు. "ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగడం సరైంది కాదు. ప్రజలకు సేవలందించే కేంద్రాలు గౌరవప్రదంగా ఉండాలి" అన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనకు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నామని మంత్రి స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు, ఏర్పడిన తర్వాత కూడా రెవెన్యూ కార్యాలయాలు ప్రజలకు సౌకర్యవంతంగా లేకపోవడంతో పాటు చాలా వరకు అద్దె భవనాలలోనే కొనసాగుతున్నాయని అన్నారు. గత ప్రభుత్వం ముందుచూపు లేకుండా, ప్రణాళికాబద్ధత లేకుండా మండలాల పునర్విభజన చేపట్టిందని, కొన్ని మండలాలు రెండు మూడు జిల్లాల పరిధిలోకి వచ్చే విధంగా రూపొందించిందని మంత్రి విమర్శించారు. అనేక కార్యాలయాల్లో కనీస వసతులు లేకపోవడం, సిబ్బంది కొరత తీవ్రంగా ఉండడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడ్డారని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్త మండలాలకు అవసరమైన పోస్టులు మంజూరు చేసి పరిపాలనను బలోపేతం చేశామని తెలిపారు. అలాగే ప్రజలకు దూరంగా కలక్టరేట్‌లను నిర్మించి నిర్వహణను గాలికి వదిలేశారని విమర్శించారు.

## సోనియా గాంధీని మర్యాదపూర్వకంగా కలిసి డిప్యూటీ సీఎం మల్లుబట్టి విక్రమార్క

◆ **తమ కుమారుడు వివాహానికి హాజరు కావలసిందిగాపెళ్లి పత్రిక అందజేయడం జరిగింది**

జన సంఘర్షణ డెస్క్ .ఫిబ్రవరి 25 .



ఢిల్లీలో సిపిపి చైర్పర్సన్ సోనియాగాంధీ కుటుంబ సభ్యులతో కలిసి మర్యాదపూర్వకంగా కలిసిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మార్చి 5న హైదరాబాద్‌లో జరగనున్న తన కుమారుడు సూర్య విక్రమాదిత్య వివాహ వేడుకకు విచ్చేసి నూతన వధూవరులను ఆశీర్వదించాలని కోరుతూ వివాహ పత్రికను అందజేసి సాదరంగా ఆహ్వానించారు. ఆమె సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డి పాఠశాలల్లో విద్యార్థులకు ఆటల కోసం ప్రత్యేక ప్రాధాన్యత

◆ **విజేతలను అభినందించిన టిపిసిసి ఉపాధ్యక్షుడు కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్.**

హైదరాబాద్, కూకట్పల్లి ప్రతినిధి అంజిబాబు, ఫిబ్రవరి 25,( జన సంఘర్షణ ):

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాఠశాలల్లో విద్యార్థులకు ఆటల కోసం అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నారని టిపిసిసి ఉపాధ్యక్షుడు కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ పేర్కొన్నారు. గతవారం గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన సీఎం కప్పు కరాటే పోటీల్లో కూకట్పల్లి నియోజకవర్గానికి చెందిన ఇద్దరు గోల్డ్ మెడల్ ఒకరు బ్రాంజ్ మెడల్ సాధించారు. అండర్ 17 విభాగంలో మహమ్మద్ జుబేర్ 55 కిలోలు,18 ప్లస్ విభాగంలో సిహెచ్. సంజయ్ 60 కేజీలు గోల్డ్ మోడల్స్ 18 ప్లస్ విభాగంలో బిహెచ్.నమ్రత 61 కేజీ లో బ్రాంచ్ మెడల్ సాధించారు.వీరు మంగళవారం రోజు బండి రమేష్ ని హేమ దుర్గా భవన్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. ఆయన వీరికి శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రోజుల్లో కరాటే మహిళల ఆత్మ రక్షణతో పాటు పురుషులకు స్వీయ రక్షణలో ఎంతో ఉపయోగపడు తుందన్నారు. ప్రతి విద్యార్థి చిన్నతనం నుంచి కబాడీ కరాటే తో పాటు ఇతర ఆటలు ఆడటం ద్వారా మానసిక శారీరక ఆరోగ్యానికి ఎంతో ఉపయోగ ఉంటుందన్నారు. విజేతలకు రాష్ట్ర ప్రభుత్వం నగదు బహుమతి సైతం అందజేసిందని అన్నారు. విద్యార్థులకు కరాటేలో శిక్షణ ఇచ్చిన స్థానికుడు అబ్దుల్ బాకీ వాక్యాన్ని రమేష్ ఈ సందర్భంగా అభినందించారు. అలాగే మరింత మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చి కరాటే లో శిక్షణ ఇచ్చి రాష్ట్ర జాతీయ స్థాయిలో విజేతలుగా



తీర్చిదిద్దాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మయ్య,లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# అవార్డు గ్రహీత కర్క నాగరాజుని అభినందించిన బండి రమేశ్

హైదరాబాద్, కూకట్పల్లి ప్రతినిధి అంజిబాబు, ఫిబ్రవరి 25,( జన సంఘర్షణ )

కూకట్పల్లి నియోజకవర్గం మూసాపేట్ డివిజన్ ప్రాంతానికి చెందిన ఐ.యన్.టి.యు.సి పీజేఆర్ ఫౌండేషన్ అధ్యక్షులు కర్క నాగరాజు అత్యంత ప్రతిష్టాత్మకమైన వరల్డ్ అచివర్స్ అవార్డు 2026 అందుకున్న సందర్భంగా మంగళవారం రోజు కూకట్పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి, టిపిసిసి ఉపాధ్యక్షుడు బండి రమేశ్ ని మర్యాద పూర్వకంగా ఆంజనేయనగర్ లో కాంగ్రెస్ పార్టీ ఆఫీసులో కలిశారు. ఈ సందర్భంగా బండి రమేశ్ మాట్లాడుతూ పీజేఆర్ ఫౌండేషన్ అధ్యక్షులు కర్క నాగరాజు కు అత్యంత ప్రతిష్టాత్మకమైన వరల్డ్ అచివర్స్ అవార్డు 2026 రావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు. భారతదేశ రాజధాని




న్యూఢిల్లీ జనక్ పూరి హోటల్ హయత్ సెంట్రిక్‌లో జరిగిన కార్యక్రమం లో కర్క నాగరాజు అవార్డును భారత మాజీ క్రికెట్ ప్లేయర్ చేతన్ శర్మ చేతుల మీదుగా అందుకోవడం పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ సోషల్ సర్వీస్, ట్రేడ్ యూనియన్ లీడర్షిప్ కేటగియరీలో ఎంపికయ్యారని వారు తెలిపారు. సామాజిక కార్యక్రమాలు కార్మికుల సమస్యలు పరిష్కరిస్తూ ముందు ముందు మరిన్ని అవార్డులు అందుకోవాలని నాగరాజుకి సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కూకట్పల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు కర్కపెంటయ్య, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ లక్ష్మయ్య,కంటెస్టెడ్ కార్పొరేటర్ రఘు, తూము మనోజ్ కుమార్, సంజీవరావు, సతీష్ రెడ్డి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# రుద్రూర్ చౌరస్తాలో రజాక్ సంఘం కొవ్వొత్తుల ర్యాలీ

◆ **గణేష్ మౌనిక దంపతులను కించపరచడం ఇంతవరకు సాధ్యం**

రుద్రూర్: ఫిబ్రవరి.25 ( జన సంఘర్షణ)







రుద్రూర్ మండల కేంద్రంలో రుద్రూర్ అంబేద్కర్ చౌరస్తా రాత్రి 8 గంటల ప్రాంతంలో కోవత్తుల ర్యాలీ తీశారు. దేవాలయానికి వెళితే, గణేష్ మౌనిక దంపతులను కించపరిచి మూడు నెలల పాపకు కాళ్లతో తన్ని కించపరచడం బీసీ కులానికి సిగ్గుచేటు అంటూ రుద్రూర్ రజాక్ సంఘం తెలిపారు...నాగూల్ కర్నూలు జిల్లా బీసీ వర్గానికి చెందిన అగ్ర కులస్తుల అహంకారం ఆగడాలు ఎక్కువైపోయాయి. చాకలి వారంటే అంత చిన్న సూపు ఎందుకు, నాగుల్ కర్నూలు గ్రామానికి చెందిన, బీసీ కులమైన రజాక్ దంపతులను, గణేష్, మౌనిక లపై దాడి చేసిన వారిని, పసిపాపని కాలి తో తన్ని చంపిన అగ్ర వర్గీకరణ, దురవాశీ కారు లైన. కాంగ్రెస్ పార్టీ మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, మధు రెడ్డి, తదితరులను, ఏంటని కటినంగా శిక్షించాలని రుద్రూర్ రజాక్ సంఘం చేసింది.

# డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నూతన సాగు పద్ధతులపై రైతులకు అవగాహన

కోటగిరి: ఫిబ్రవరి.25 (జన సంఘర్షణ)

నిజామాబాద్ జిల్లా, కోటగిరి మండలం యాద్గార్‌పూర్, ఎత్తోండ గ్రామంలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ అధికారులు వరి పంటలో ఆధునిక సాగు పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు సీడ్ డ్రిల్ , డ్రం సీడర్ వాడకంతో నేరుగా వరి విత్తడం, తడి-పొడి పద్ధతి తో (ఏడబ్లుడీ పైపు) నీటి యాజమాన్యం, జీరో టిలేజ్ మొక్క జొన్న గురించి వివరించారు. ఈ ఆధునిక పద్ధతుల ద్వారా: పెట్టుబడి భారం తగ్గడం, కూలీల ఖర్చు సుమారుగా 8,000 వరకూ ఆదా కావడం. సాగు సమయంలో సమయమంతా ఆదా కావడం వంటి ప్రయోజనాలు ఉన్నట్లు వివరించారు. అలాగే భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు, మందుల వినియోగం తగ్గించుకోవడం




ద్వారా పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని చెప్పారు. మెట్ట, దుక్కి భూముల్లో ఈ పద్ధతులు అనుసరిస్తే, సమయం ఆదా కావడంతో పాటు చీడపీడల నివారణ కూడా సులభంగా చేయవచ్చని వారు వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ అధికారులు ఏరియా మేనేజర్ అరుణ్ కమ్యూనిటీ ఫెసిలిటేటర్ ప్రశాంత్, చందు ,లక్ష్మణ్ ,అనిల్ సామాజిక సేవ కార్యకర్త తోట శ్రీకాంత్ గ్రామ సర్పంచ్లు షేక్ గౌస్,సూర్యకాంత్, అర్జున్, రైతులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

# తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్‌గా కె.శ్రీనివాస్ రెడ్డికి మరో రెండేళ్ల పొడిగింపు

హైదరాబాద్ సిటీ బ్యూరో / ఫిబ్రవరి 25(జనసంఘర్షణ )




తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్‌గా కె. శ్రీనివాస్ రెడ్డిని మరో రెండేళ్ల పాటు కొనసాగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రెండోసారి ఆయనను చైర్మన్‌గా నియమిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ సందర్భ ంగా టీయూడబ్ల్యూజే-ఐజేయూ మేడ్చల్ జిల్లా ప్రతినిధులు కె. శ్రీనివాస్ రెడ్డిని కలిసి శు భాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర కోశాధికారి మోతే వెంకటరెడ్డి, జిల్లా అధ్యక్షుడు గడ్డమీది బాలరాజ్, జిల్లా కార్యదర్శి దొంతుల వెంకట్రాంరెడ్డి, టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి వరకాల యాదగిరి, హెచ్‌యుజె అధ్యక్షుడు శిగా శంకర్ పాల్గొన్నారు. చైర్మన్‌గా మరోసారి బాధ్యతలు చేపట్టిన కె. శ్రీనివాస్ రెడ్డి మీడియా రంగ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమం, శిక్షణా కార్యక్రమాలు, నైపుణ్యాభివృద్ధి అంశాలకు ప్రాధాన్యం ఇస్తానని పేర్కొన్నారు. టీయూడబ్ల్యూజే నాయకులు ఆయనకు అభినందనలు తెలియజేస్తూ, మీడియా రంగానికి మరింత బలోపేతం కలిగేలా చర్యలు తీసుకోవాలని ఆకాంక్షించారు.

# అవినీతి తిమింగలం గనులశాఖ డిప్యూటీ డైరెక్టర్

◆ **పోలీసులు ఆయన ఇంట్లో సోదాలు చేయగా భారీ ఎత్తున నగదు బయటపడింది**

జన సంఘర్షణ డెస్క్ . ఫిబ్రవరి 25



ఒడిశాలోని కటక్ సర్కిల్ కనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ దెబ్రత మహంతిని అవినీతి కేసులో విజిలెన్స్ అధికారులు అరెస్టు చేశారు. భువనేశ్వర్‌లోని ఆయన అపార్ట్‌మెంట్‌లో 4 కోట్లు, ఆయన కార్యాలయంలో 1.20 లక్షలు నగదును గుర్తించారు. ఒరిస్సా రాష్ట్ర చరిత్రలో విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకోవడం తొలిసారి అని సదరు వర్గాలు పేర్కొన్నాయి. భువనేశ్వర్‌లోని ఆయన అపార్ట్‌మెంట్‌లో అల్మారాలో దాచిన రూ4 కోట్లను అధికారులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. కార్యాలయంలోని టేబుల్‌లో మరో రూ.1.20 లక్షల నగదును గుర్తించారు. భువనేశ్వర్‌లో మరో రెండంతస్తుల భవనం, 130 గ్రాముల బంగారం గుర్తించినట్లు విజిలెన్స్ వర్గాలు వెల్లడించాయి. ఈ స్థాయిలో నోట్ల కట్టలను విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకోవడం రాష్ట్ర చరిత్రలో ఇదే తొలిసారి అని సదరు వర్గాలు పేర్కొన్నాయి. భువనేశ్వర్‌లో విజిలెన్స్ అధికారులు రూ.4 కోట్లు, రూ.1.20 లక్షల నగదు, 130 గ్రాముల బంగారం, రెండంతస్తుల భవనాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఇది రాష్ట్ర చరిత్రలో అతిపెద్ద నగదు స్వాధీనం.

# గాలివాన బీభత్సం-కుప్పకూలిన విద్యుత్ స్తంభాలు

మహబూబాబాద్ . ఫిబ్రవరి 25 . (జన సంఘర్షణ )




మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలంలో బుధవారం కురిసిన భారీ వర్షం, గాలి దుమారం బీభత్సం సృష్టించింది. మండలంలోని ఓటాయి గ్రామంలో ఈదురు గాలుల ధాటికి జనజీవనం ఒక్కసారిగా చిందరవందర అయింది.వివరాలు ఇలా ఉన్నాయి. గాలివాన తీవ్రతకు ఓటాయి గ్రామంలో విద్యుత్ స్తంభాలు కూలిన సమయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పెద్ద ప్రమాదం తప్పినప్పటికీ, భారీ శబ్దంతో స్తంభాలు పడిపోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. కూలిన స్తంభాల వల్ల ఎవరికీ ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం సర్పంచ్ గట్టి రాములు ఈ విషయాన్ని వెంటనే విద్యుత్ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం.

# చిన్నారి మృతికి కారకులైన వారిని శిక్షించాలి

నాగర్ కర్నూల్ జిల్లా . ఫిబ్రవరి 25 . (జన సంఘర్షణ )

నాగర్ కర్నూలు జిల్లా మల్లన్న జాతరలో రెండు సంవత్సరాల చిన్నారిని కాలుతో తన్ని చంపిన సర్పంచ్ పై ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని సిపిఐ జిల్లా సమితి సభ్యులు రజక సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు నేరెళ్ల రమేష్ డిమాండ్



చేశారు.చిన్నారి మృతికి సంతాపంగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగర్ కర్నూల్ జిల్లా మల్లన్న జాతరలో చంద్రకళ కుటుంబాన్ని దర్శనానికి వెళ్ళనివ్వకుండా అడ్డుకొని ఆ కుటుంబం పై దాడి చేసి 2 నెలల చిన్న పాప అని చూడకుండా విచ క్షణా రహితం గా కొట్టి ,దాడి చేసి అభం శుభం తెలియని పసి కందు ప్రాణం తీసిన సర్పంచ్ పై హత్య కేసు నమోదు చేసి దాడికి పాల్పడిన వారందరి పైన చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని, ఇలాంటి దాడులు భవిష్యత్తులో జరగకుండా ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపట్టాలని, అని అన్నారు.డబ్బు కులాహంకారంతో విర్రవీగుతున్న ఇలాంటి వారిపై అధికారులు, ప్రభుత్వం, నిష్పక్షపాతంగా విచారణ చేసి, దోషులను బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం పట్టణ అధ్యక్షులు సుంకర అజిత్, కార్యదర్శి భూష రాజు, పట్టణ నాయకులు రాచర్ల ,సర్వీస్ కనకారావు, పోషి ఉల్లెంగల, రమేష్, హరి, సిపిఐ మహిళా సంఘం నాయకురాలు కరిష్మా రత్నకుమారి, రజక సంఘం నాయకురాలు సత్తెనపల్లి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## యాదాద్రిలో వైభవంగా బ్రహ్మోత్సవాలు

**రామావతారంలో హనుమంత వాహన సేవలో నారసింహుడు**

**యాదగిరిగుట్ట, ఫిబ్రవరి25 :** యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు బుధవారం ఉదయం శ్రీరామ అలంకారంలో హనుమంత వాహన సేవపై యాదగిరి శ్రీలక్ష్మి నరసింహస్వామి వారు ఆలయ తిరు మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. నయన మనోహరంగా స్వామివారు అలంకార సేవపై ఊరేగుతూ భక్తులకు కనువిందు చేశారు. లోక కల్యాణం కోసం స్వామివారు వివిధ అవతారాలు ఎత్తారని ఈ సందర్భంగా అర్చకులు ఉపదేశించారు. ప్రత్యేకంగా తెప్పించిన పూలతో స్వామివారిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. వేద మంత్రలు, వేదపారాయణలు, మంగళ వాయిద్యాల నడుమ అంగరంగ వైభవంగా స్వామి వారి ఊరేగింపు సేవ పై ఊరేగారు. రాత్రి స్వామి అమ్మవార్ల కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. దీనికోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉత్తర మాడవీధుల్లో ప్రత్యేకమైన కల్యాణ వేదికను సిద్ధం చేశారు. వీవీఐపీ, వీఐపీ, ఇతర భక్తులు స్వామి వారి కల్యాణాన్ని వీక్షించే విధంగా ప్రత్యేకమైన ఏర్పాట్లు పూర్తి చేశారు. కొండపైన పలు ప్రాంతాల్లో ఎల్ ఈ డీ స్క్రీన్లను ఉంచారు. ఈ సేవలో జిల్లా కలెక్టర్ హనుమంతరావు, ఆలయ భవానీ శంకర్, ఆలయ అనువంశిక ధర్మకర్త నరసింహ మూర్తి, డీఈవో భాస్కర్ శర్మ, ప్రధానార్చకులు కాండూరి వెంకటాచార్యులు, భట్టర్ సురేంద్రాచార్యులు, ఆలయ అధికారులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

## విరోష్ జంటకు ప్రధాని శుభాకాంక్షలు

**విషెష్ చెబుతూ మోడీ లేఖ**

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25 :** విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న మరికొన్ని గంటల్లో వివాహ బంధంతో ఒక్కటి కాబోతున్నారు. వీరి వివాహం ఉదయ్ పూర్ లో జరగనుంది. రష్మిక, విజయ్ వివాహం రాజస్థాన్ లోని ఉదయ్‌పూర్ లో ఉన్న ఐటీసీ హోటల్లో గ్రాండ్ గా జరగనుంది. వారి వివాహ వేదిక వద్ద మూడు అంచెల భద్రతను మోహరించినట్లు తెలుస్తోంది. స్థానిక పోలీసులు, హైదరాబాద్ నుంచి వచ్చిన ప్రత్యేక బృందం, అంతర్జాతీయ భద్రతా మధ్య ఈ వేడుక జరగనుంది. వీరి వివాహానికి కొద్దిమంది అతిధులు మాత్రమే హాజరుకానున్నారు. అంబానీకి కుటుంబం విజయ్ దేవరకొండ వివాహానికి హాజరు కానున్నారు. ఇప్పటికే అంబానీ ఫ్యామిలీ ఉదయ్ పూర్ కు చేరుకుంది. అదేవిధంగా విజయ్ దేవరకొండ , రష్మిక వివాహానికి శుభాకాంక్షలు తెలుపుతూ.. ప్రధాని మోడీ లేఖ రాశారు. ఫిబ్రవరి 26 న విజయ్ , రష్మిక వివాహం జరగనుంది. కాబోయే వధూవరులకు మోడి శుభాకాంక్షలు తెలిపారు. సప్తపదితో జీవితాంతం స్నేహంతో వర్ధిల్లాలని ఆశీస్సులు అందజేశారు. అలాగే విజయ్ రష్మిక జీవితం అద్భుతంగా ఉండాలని కోరుకుంటూ.. పరస్పరం గౌరవం, ప్రేమ, బాధ్యతలను పంచుకోవాలని మోడి సూచించారు. కాగా విజయ్, రష్మిక వివాహానికి కేవలం 100 మంది అతిథులను మాత్రమే ఆహ్వానించారు. అతిథులు, సన్నిహితుల కోసం మార్చి 4న హైదరాబాద్ లో రిసెప్షన్ నిర్వహించనున్నారు. అభిమానుల కోరిక మేరకు తమ పెళ్లి వేడుకకు 'విరోష్' అని పేరు పెట్టినట్లు సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు.

## యూత్ కాంగ్రెస్ నేతల అరెస్ట్ సిగ్గుచేటు

**కేంద్రం చర్యను తప్పపట్టిన ప్రియాంక**

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25 :** ఇటీవల ఢిల్లీలో జరిగిన ఎఐ సమ్మిట్‌లో కాంగ్రెస్ యువ నేతలు భారత్– అమెరికా ఒప్పందాన్ని వ్యతిరేకిస్తూ చొక్కాలు విప్పి నిరసన తెలిపారు. సమ్మిట్‌లో నిరసన చేసిన కాంగ్రెస్ నేతల్ని పోలీసులు అరెస్టు చేయడాన్ని కాంగ్రెస్ నేత, వయనాడ్ ఎంపి ప్రియాంక గాంధీ వాద్రా బుధవారం తీవ్రంగా ఖండించారు. ఈ అరెస్టు సిగ్గుచేటని ఆమె ధ్వజమెత్తారు. 'సత్యం కోసం, శాంతియుత, అహింసాయుత ప్రతిఘటన మనం గర్వించదగిన వారసత్వం. ఇది మహాత్మాగాంధీ, లక్షలాది మంది భారతీయుల పూర్వీకుల నుండి వారసత్వంగా వచ్చింది. ప్రపంచ ఒత్తిడికి తలొగ్గి భారతదేశ ప్రయోజనాలతో రాజీపడిన ప్రధానికి, ఆయన ప్రభుత్వానికి వ్యతిరేకంగా స్వరం పెంచడం 1.4 బిలియన్ల భారతీయుల ప్రయోజనాలకు మంచిది. ప్రజల గొంతును పెంచినందుకు యూత్ కాంగ్రెస్ సభ్యులపై తీసుకున్న చర్య తీవ్రంగా ఖండించదగినది. సిగ్గుచేటైన విషయం. కాంగ్రెస్ పార్టీ కాంగ్రెస్ యొక్క నిర్భయ సైనికులకు దృఢంగా అండగా నిలుస్తుంది ' అని ఆమె బుధవారం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు పేర్కొన్నారు. చేశారు. అని ప్రియాంక ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. ఃూగా, ఎఐ సదస్సులో షర్ట్ విప్పి నిరసన తెలిపిన ఘటనకు కీలక సూత్రధారిగా భావించిన యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఉదరు భాను చిబ్‌ను మంగళవారం అరెస్టు చేశారు. ఉదరు భానుతోపాటు మరో ఆరుగురు కాంగ్రెస్ కార్యకర్తల్ని అరెస్టు చేసి.. వారిపై అల్లర్లకు పాల్పడినట్లు పోలీసులు అభియోగాలు మోపారు.

## ఆస్పత్రి నుంచి శరద్ పవార్ డిశ్చార్జ్

**ముంబయి, ఫిబ్రవరి 25 :** ఇటీవల అనారోగ్య కారణాల రీత్యా చికిత్స కోసం ఎన్‌సిపి నేత శరద్‌పవార్ పూనెలోని రూబీ హాల్ ఆసుపత్రిలో చేరారు. డీహైడ్రేషన్‌కు గురైన ఆయన్ను కుటుంబ సభ్యులు ఆదివారం ఈ ఆసుపత్రిలో చేర్పించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం మెరుగుపడడంతో బుధవారం ఉదయం ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేసినట్లు వైద్యులు తెలిపారు. ప్రస్తుతం శరద్‌పవార్ బాగానే ఉన్నారు. అందుకే ఆయనను డిశ్చార్జ్ చేశాం. రెండు రోజులు విశ్రాంతి తీసుకోవాలని సూచించాం అని రూబీ హాల్ ఆసుపత్రి చీఫ్ కార్డియాలజిస్ట్, ఛైర్మన్ మేనేజింగ్ ట్రస్టీ అయిన డాక్టర్ పర్వేజ్ గ్రాంట్ అన్నారు. ఃూగా, శరద్‌పవార్ ఈ నెల్లోనే ఫిబ్రవరి 9న ఛాతి ఇన్ఫెక్షన్ వల్ల ఇదే ఆసుపత్రిలో చికిత్స కోసం చేరారు. ఆరోగ్యం మెరుగుపడగానే ఆయన ఫిబ్రవరి 14న డిశ్చార్జ్ అయ్యారు.

## యూట్యూబర్ కోమలి ఆత్మహత్య

**ప్రేమ వ్యవహారమే కారణమని అనుమానాలు**

**హైదరాబాద్,ఫిబ్రవరి 25 :** హైదరాబాద్ చిత్రపురి కాలనీలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. ప్రముఖ యూట్యూబర్ కోమలి ఆత్మహత్య చేసుకుంది. ఇంట్లో ఎవరూలేని సమయంలో ఆమె ఇలా బలవన్మరణానికి పాల్పడినట్టు తెలుస్తోంది. నగరంలోని ఓ ప్రముఖ కాలేజ్‌లో బీఎస్సీ చదువుతున్న కోమలి.. చిత్రపురి కాలనీలో తన బంధువుల ఇంట్లో ఉంటోంది. విశాఖపట్నానికి చెందిన కోమలి.. తక్కువ కాలంలో యూట్యూబర్‌గా మంచి పేరు సంపాదించుకుంది. కోమలి.. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న ఓ వ్యక్తిని ప్రేమించింది. ఏడాది క్రితం ఇద్దరి మధ్య విభేదాలు రావడంతో బ్రేకప్ అయ్యింది. ఈ నేపథ్యంలో కొన్ని నెలల క్రితం కోమలి ఆత్మహత్యకు యత్నించగా.. బంధువులు కాపాడారు. ఈ మధ్య మరోసారి ఆ యువకుడితో గొడవ జరిగినట్లు సమాచారం. దీంతో మనస్తాపానికి గురైన ఆమె.. సోమవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరివేసుకుంది. ఆమె తల్లి మంగళవారం రాయదుర్గం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో.. ఈ విషయం వెలుగులోకి వచ్చింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

# ఉదయ్‌పూర్‌లో విరోష్ పెళ్లిసందడి

**హాజరవుతున్న అంబానీ కుటుంబం**

**ఉదయ్‌పూర్,ఫిబ్రవరి 25 :** టాలీవుడ్ క్రేజీ జంట విజయ్ దేవరకొండ,రష్మిక మందన్న వివాహ వేడుకలు రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో ఘనంగా కొనసాగుతున్నాయి. ఫిబ్రవరి 26న జరగనున్న ఈ ప్రైవేట్ వెడ్డింగ్‌కు సంబంధించిన ప్రీవెడ్డింగ్ వేడుకలు ఇప్పటికే పీక్స్‌కు చేరుకున్నాయి. కేవలం 100 మంది అత్యంత సన్నిహితుల సమక్షంలో ఈ వేడుక జరగనున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ప్రముఖ వ్యాపారవేత్త ముఖేష్ అంబానీ కుటుంబం ఉదయ్‌పూర్‌కు చేరుకోవడంతో జోరుగా చర్చ మొదలైంది. ఆయనతో పాటు నీతా అంబానీ, కోకిలాబెన్ అంబానీ, ఆకాశ్ అంబానీ, శ్లోకా అంబానీ కూడా వచ్చినట్లు ప్రచారం సాగింది. దీంతో అంబానీ కుటుంబం విరోష్ వెడ్డింగ్‌కు హాజరవుతున్నారన్న వార్తలు వైరల్ అయ్యాయి. అయితే తాజా సమాచారం ప్రకారం అంబానీ కుటుంబం ఉదయ్‌పూర్ సందర్శనకు ఈ వివాహంతో ఎలాంటి సంబంధం లేదని స్పష్టమైంది. ఉదయ్‌పూర్ సమీపంలోని నాథ్‌ద్వారాలో ఉన్న శ్రీనాథ్ జీ ఆలయంలో దర్శనం కోసం అంబానీ కుటుంబ సభ్యులు వెళ్లినట్లు తెలుస్తోంది. ఆలయం వద్ద తీసిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో అభిమానులు వాటిని విరోష్ వెడ్డింగ్‌కి అటాచ్ చేశారు. అయితే ఇది కేవలం యాదృచ్ఛికమేనని, పెళ్లికి సంబంధం లేదని సమాచారం. ఈ సెలబ్రిటీ వివాహం పూర్తిగా ప్రైవేట్ వేడుకగా జరుగుతోంది. ఇప్పటికే ఉదయ్‌పూర్ విమానాశ్రయంలో కనిపించిన వారిలో దర్శకుడు తరుణ్ భాస్కర్, నటి ఈషా రెబ్బా, నటి ఆషికా రంగనాథ్, దర్శకుడు రాహుల్ రవీంద్రన్ తదితరులు ఉన్నారు. దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కూడా హాజరయ్యే అవకాశమున్నట్లు టాక్ వినిపిస్తోంది.వివాహ విందు పూర్తిగా దక్షిణాది శైలిలో ఉండబోతోందని సమాచారం. అతిథులకు అరిటాకుల్లో భోజనం వడ్డించనున్నారు. ప్రత్యేకంగా కొబ్బరి నీళ్లను కూడా ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికే కుటుంబ సభ్యులు, స్నేహితులు కలిసి సరదా క్రీడలతో సందడి చేశారు. ఫిబ్రవరి 26, 2026న ప్రధాన వివాహం జరగనుండగా, సినీ పరిశ్రమ స్నేహితుల కోసం మార్చి 4న ప్రత్యేక విందు ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. మొత్తానికి, అంబానీలు ఉదయ్‌పూర్‌లో ఉన్నారన్న విషయం నిజమే అయినప్పటికీ, అది విజయ్ దేవరకొండ,రష్మిక మందన్న పెళ్లితో సంబంధం లేదని సమాచారం.

## స్పీకర్ కోర్టులో మరో ఇద్దరి భవితవ్యం

**కడియం, దానంలపై తుది విచారణ**

**27,28 తేదీల్లో విచారణకు సిద్ధం**

**హైదరాబాద్, ఫిబ్రవరి 25 :** తెలంగాణ రాజకీయాల్లో అత్యంత ఆసక్తి రేపుతున్న ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్ల వ్యవహారం కీలక దశకు చేరుకొన్నది. ఇప్పటికే 8మంది విషయంలో స్పీకర్ స్పష్టమైన తీర్పును ఇచ్చారు. వీరు పార్టీ మారినట్లుగా ఆధారాలు లేవని స్పీకర్ తీర్పును ఇచ్చారు. ఇప్పుడు మరో ఇద్దరు ఎమ్మెల్యేల వ్యవహారాన్ని తేల్చబోతున్నారు. రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ ప్రకారం దాఖలైన అనర్హత పిటిషన్లపై విచారణ జరిపేందుకు శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ షెడ్యూల్‌ను ఖరారు చేశారు. ఈ నెల 27, 28 తేదీల్లో పార్టీ ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న దానం నాగేందర్, కడియం శ్రీహరి విచారణకు తమ వాదనలను వినిపించడంతోపాటు సాక్ష్యాధారాలను సమర్పించాల్సి ఉంటుందని షెడ్యూల్‌లో పేర్కొన్నారు. స్పీకర్ నేతృత్వంలోని ట్రిబ్యునల్ ఎదుట పిటిషనర్ల తరఫు న్యాయవాదులు అడిగే ప్రశ్నలకు దానం, కడియం సమాధానాలు ఇవ్వాల్సి ఉంటుంది. బీఆర్‌ఎస్ పార్టీ గుర్తుపై గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరలేదని నిరూపించుకోవడానికి అవసరమైన ఆధారాలను సమర్పించాల్సి ఉంటుంది. గత నెల 18న ఈ కేసులో పిటిషనర్ పాడి కౌశిక్‌రెడ్డిని దానం నాగేందర్ తరఫు న్యాయవాదులు ప్రశ్నించారు. 19న కడియం తరఫు లాయర్లు వివేకానందగౌడ్‌ను ప్రశ్నించారు. స్పీకర్ జారీచేసిన విచారణ షెడ్యూల్ ప్రకారం బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై ఈ నెల 27వ తేదీన ఉదయం 11:00 గంటలకు విచారణ ఉంటుంది. బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై మధ్యాహ్నం 12:00 గంటలకు విచారణ చేపడుతారు. 28వ తేదీన ఉదయం 11:00 గంటలకు బీఆర్‌ఎస్ పార్టీ కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానందగౌడ్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ ఉంటుంది. ప్రతివాది స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తరఫున సాక్ష్యాధారాలను సేకరిస్తారు.

## జీనుగురాలలో పల్లె ప్రకృతి వనంలో 200 చెట్ల నరికివేత

**ప్రకృతి వనాలపై పగబట్టడం దుర్మార్గమైన చర్య అన్న కెటిఆర్**

**హైదరాబాద్,ఫిబ్రవరి 25** కాంగ్రెస్ కబంద హస్తాల్లో చిక్కుకుని రెండేళ్లుగా విలవిలలాడుతున్న తెలంగాణలో మనషులనే కాదు.. చివరికి పచ్చని చెట్లను కూడా బతకనివ్వడం లేదని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ప్రతి పల్లెలో పచ్చదనం ఉండాలనే మహోన్నత లక్ష్యంతో కేసీఆర్ నిర్మించిన ప్లలె ప్రకృతి వనాలపై కూడా పగబట్టడం దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు. మహబూబ్ నగర్‌లోని దేవరకద్ర మండలం జీనుగురాలలో పల్లె ప్రకృతి వనంలోని 200 చెట్లను కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులే నిర్దాక్షిణ్యంగా నరికివేయడం దారుణమని కేటీఆర్ విమర్శించారు. పదేళ్లపాటు ఆహ్లాద వాతావరణంలో కళకళలాడిన ప్లలెలను అన్నిరకాలుగా ధ్వంసం చేస్తున్న కాంగ్రెస్ నిజస్వరూపం రోజుకో రూపంలో బయటపడుతోందని తెలిపారు. ఇప్పటికే చెక్ డ్యామ్‌లను పేల్చివేస్తున్నారని.. చెరువులను చెరబట్టారని..
వ్యవసాయాన్ని కుప్పకూల్చారని.. కులవృత్తులను కాలరాశారని పేర్కొన్నారు. ఇప్పుడు నీడనిచ్చే చెట్లను కూడా అడ్డంగా నరికేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశు ద్ధి ఉన్నా వెంటనే ఈ దుశ్చర్యకు పాల్పడిన ప్రతి ఒక్కరిపై కేసు నమోదుచేసి కఠినంగా శిక్షించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. 'పల్లె కన్నీరు పెడుతుందో' అని మరోసారి పాడుకునే దుస్థితి తెచ్చిన కాంగ్రెస్ పార్టీపై తెలంగాణలోని ప్రతి గ్రామం తిరగబడే రోజు దగ్గర్లోనే ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.

## వేంపల్లె నందీశ్వరాలయంలో ప్రతిష్ట

**ప్రత్యేక పూజల్లో పాల్గొన్న వైఎస్ జగన్**

**పులివెందుల,ఫిబ్రవరి 25** వైసిపి అధినేత వైఎస్ జగన్ రెండో రోజు పులివెందులలో పర్యటించారు. ఈ సందర్భంగా బుధవారం ఉదయం 10.30 గంటలకు వేంపల్లి మండలం నందిపల్లి నందీశ్వర ఆలయాన్ని వైఎస్ జగన్ సందర్శించారు. నందీశ్వర ఆలయంలో విగ్రహ ప్రతిష్ట సందర్భంగా ప్రత్యేక పూజలు, హోమంలో జగన్ పాల్గొన్నారు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఆలయానికి రూ. 1.8 కోట్లు మంజూరు చేశారు. మొత్తం ఆరు కోట్ల రూపాయలతో దేవాలయ నిర్మాణం జరిగింది. ఈ కార్యక్రమం తర్వాత.. వైఎస్ జగన్ మధ్యాహ్నం నుంచి క్యాంపు కార్యాలయంలో ప్రజదర్బార్ నిర్వహించనున్నారు. అయితే దీనికి ముందుగా పులివెందుల నివాసం నుంచి బయలుదేరిన వైఎస్ జగన్? వైఎస్ రాజారెడ్డి సోదరిని పరామర్శించి, యోగక్షేమాలు తెలుసుకున్నారు.

## యూరియా కోసం సిపిఎం ధర్నా

**నల్లగొండ,ఫిబ్రవరి 25 :** రాష్ట్రంలో రైతుల యూరియా కష్టాలు తప్పడం లేదు. ఆరుగాలం కష్టపడి పంటలు పండించే రైతన్నలకు కాంగ్రెస్ పాలనలో యూరియా కష్టాలు కొనసాగుతూనే ఉన్నాయి. వానకాలం, యాసంగిలోనూ ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. ఒక్క బస్తా యూరియా కోసం ఉదయం నుంచి పడిగాపులు కాయాల్సిన పరిస్థితి దాపురించింది.ప్రభుత్వం కొత్తగా యాప్ తీసుకొచ్చి ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవాలని సూచించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తాజాగా నల్లగొండలో యూరియా సమస్యలు తీర్చాలని సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. పానగల్లు పీఏసీఎస్ గోదాం దగ్గర స్మార్ట్ ఫోన్ పట్టుకుని బుకింగ్ కోసం రైతులు పడుతున్న ఇబ్బందులను తొలగించాలన్నారు. సమస్య పరిష్కారం అయ్యేంత వరకు ఉద్యమిస్తామని హెచ్చరించారు.

## మోడీకి ఇజ్రాయిల్ గుజరాత్ లాంటిదే

**సిపిఐ ఎంపి సంతోష్ కుమార్ విమర్శలు**

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 25** ప్రధాని నరేంద్ర మోడీకి ఇజ్రాయిల్ రెండో గుజరాత్ లాంటిదని సిపిఐ ఎంపి సంతోష్ కుమార్ విమర్శించారు. ప్రధాని మోడీ రెండురోజులపాటు ఇజ్రాయిల్ పర్యటన కొనసాగుతుంది. ఈ నేపథ్యంలో గాజాలో మారణహోమం సృష్టించి వేలాది మంది పాలస్తీనియన్ల ప్రాణాలను బలితీస్తున్న ఇజ్రాయిల్‌ను మోడీ సందర్శించడంపై తీవ్ర విమర్శలు వెల్లువెతుతున్నాయి. తాజాగా మోడీ ఇజ్రాయిల్ పర్యటనపై సిపిఐ ఎంపి సందోష్‌కుమార్ మీడియాతో మాట్లాడుతూ.. 'ఇజ్రాయిల్‌ను సందర్శించడం ప్రధాని మోడీకి ఒక హాబీగా మారింది. ఇజ్రాయిల్ ఆయనకు రెండవ గుజరాత్. ఇజ్రాయిల్ మానవాళి ప్రయోజనాలకు వ్యతిరేకంగా వ్యవహరించే దేశం. గాజాను లక్ష్యంగా చేసుకుని అమాయక ప్రజలను చంపుతోంది. మీకు తెలుసా..మోడీకి ఇజ్రాయిల్‌ని సందర్శించడం గుజరాత్‌ను సందర్శించడం లాంటిది' అని సందోష్ కుమార్ అన్నారు.

## ఢిల్లీలో గ్యాంగ్‌స్టర్ల కదలికలు కలకలం

**బిష్ణోయ్ లీగల్ టీమ్‌పై కాల్పులు**

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25 :** దేశ రాజధానిలో మరోసారి గ్యాంగ్‌స్టర్ల కదలికలు కలకలం రేపాయి. తీహార్ జైలులో ఉన్న గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ లీగల్ టీమ్‌ను లక్ష్యంగా చేసుకుని గుర్తుతెలియని వ్యక్తులు కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటన ఢిల్లీలోని రోహిణి ప్రాంతంలో చోటుచేసుకుంది. లారెన్స్ బిష్ణోయ్ తరపున కోర్టు కేసులను వాదించే న్యాయవాదుల బృందం వాహనంలో ప్రయాణిస్తున్న సమయంలో ఈ దాడి జరిగింది. బైక్‌పై వచ్చిన దుండగులు ఒక్కసారిగా లీగల్ టీమ్ వాహనంపై కాల్పులు జరిపి అక్కడి నుంచి పరారయ్యారు. అదృష్టవశాత్తూ ఈ ఘటనలో ఎవరికీ ప్రాణాపాయం జరగలేదు. సమాచారం అందుకున్న వెంటనే ఢిల్లీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. సీసీటీవీ (అఅ÷ఎ) ఫుటేజీ ఆధారంగా నిందితులను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇది గ్యాంగ్ వార్‌లో భాగమా లేక లాయర్లను భయపెట్టడానికి చేసిన ప్రయత్నమా అనే కోణంలో విచారణ జరుపుతున్నారు. కాగా, లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ ఇప్పటికే అనేక హై–ప్రొఫైల్ హత్యలు, బెదిరింపుల కేసుల్లో నిందితులుగా ఉన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో అతని లీగల్ టీమ్‌పై దాడి జరగడం సంచలనంగా మారింది.

## 2019 ఈస్టర్ బాంబు పేలుళ్ల కేసు

**శ్రీలంక మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్ అరెస్ట్**

**కొలంబొ, ఫిబ్రవరి25 :** 2019 ఈస్టర్ బాంబు పేలుళ్ల కేసులో శ్రీలంక మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్‌ను దర్యాప్తు అధికారులు అదుపులోకి తీసుకున్నారు. బుధవారం తెల్లవారుజామున రాజధాని శివారులో రిటైర్డ్ మేజర్ జనరల్ సురేష్ సల్లేను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈస్టర్ ఆదివారం పేలుళ్లకు కుట్ర పన్నడం, సహాయం చేయడం మరియు ప్రోత్సహించినందుకు ఆయనను అరెస్ట్ చేశారని అన్నారు. గోటబయ రాజపక్స అధ్యక్షుడైన తర్వాత 2019లో స్టేట్ ఇంటెలిజెన్స్ సర్వీస్ (ఎస్ఐఎస్) చీఫ్‌గా సురేష్ పదోన్నతి పొందారని, ఆత్మాహుతి బాంబుదాడులకు సహకారం అందించారని దర్యాప్తు అధికారులు పేర్కొన్నారు. సురేష్ ఇస్లామిక్ బాంబర్లతో సంబంధం కలిగి ఉన్నాడని, దాడికి ముందు వారిని కలిశారని బ్రిటన్ మీడియా 2023లో వెల్లడించింది. ఆ ఏడాది జరిగిన అధ్యక్ష ఎన్నికలను రాజపక్సకు అనుకూలంగా ప్రభావితం చేసేందుకు ఈ దాడిని కొనసాగించేందుకు ఆయన అనుమతించాడని ప్రజావేగు ఒకరు మీడియాకు తెలిపారు. 2019లో ఈస్టర్ పండుగ సమయంలో దేశవ్యాప్తంగా జరిగిన బాంబు పేలుళ్లలో 45మంది విదేశీయులు మరణించగా, 500మందికి పైగా గాయపడిన సంగతి తెలిసిందే.

## మచిలీపట్నం పాల కేంద్రాల్లో తనిఖీలు

**మచిలీపట్నం,ఫిబ్రవరి 25** రాజమహేంద్రవరంలో ఇటీవల జరిగిన కల్తీ పాల ఘటన నేపథ్యంలో ఏపీలోని వివిధ జిల్లాల్లో ఫుడ్ సేఫ్టీ అధికారులు పాల సరఫరా కేంద్రాలు, డైరీలపై తనిఖీలు ముమ్మరం చేశారు. బుధవారం ఉదయం కృష్ణా జిల్లా మచిలీపట్నంలోని పలు పాల కేంద్రాలపై అధికారులు విస్తృత తనిఖీలు చేపట్టారు. మచిలీపట్నంలోని జిల్లా పరిషత్ సెంటర్, చిలకలపూడి ప్రాంతంలోని పాల కేంద్రాల్లోని పాలను ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లు పరిశీలించారు. ఎస్.ఎస్ మిల్క్, జిల్లా పరిషత్ కృష్ణవేణి మిల్క్ డైరీ పాల కేంద్రాల నుంచి పాల శాంపిల్స్‌ను సేకరించి ల్యాబ్స్‌కు పంపించారు.

## సిఎం రేవంత్‌తో అడోబ్ సిఇవో శంతన్ భేటీ

**హైదరాబాద్, ఫిబ్రవరి 25** : తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిని అడోబ్ సీఈవో శంతను నారాయణ్ కలిశారు. హైదరాబాద్‌లో సీఎంతో ఆయన భేటీ అయ్యారు. తెలంగాణ రైజింగ్ బోర్డు సభ్యుడిగానూ శంతను కొనసాగుతున్న నేపథ్యంలో గ్లోబల్ ట్రెండ్స్, కొత్త అవకాశాలతో రేవంత్‌తో చర్చించారు. ఉద్యోగాలపై ఏఐ ప్రభావం, గ్రీన్ ఎనర్జీ, ప్రభుత్వపరంగా చేపట్టాల్సిన చర్యలు తదితర అంశాలపై చర్చ జరిగింది. ఏఐని సమర్థంగా వినియోగించుకునే విషయంపై శంతను నారాయణ్‌తో రేవంత్ చర్చించారు.

## ఇంటర్ పరీక్షకు 17 నిముషాలు ఆలస్యం

**పరీక్షా కేంద్రానికి అనుమతించని అధికారులు.. కన్నీరు పెట్టుకున్న విద్యార్థిని శరణ్య**

**రాజన్నసిరిసిల్ల,ఫిబ్రవరి 25** : ఎగ్జామ్ సెంటర్‌కు ఆలస్యంగా రావడంతో ఇంటర్ విద్యార్థినిని పరీక్ష రాసేందుకు అనుమతించలేదు. తన తండ్రి డ్రాప్ చేస్తాడేమోనని ఎదురుచూసి చూసి, చివరకు ఆర్టీసీ బస్సులో రావడంతో ఎగ్జామినేషన్ సెంటర్‌కు 17 నిమిషాలు ఆలస్యంగా చేరుకుంది. ఈ క్రమంలో అధికారులు పరీక్షకు అనుమతించకపోవడంతో.. సెంటర్ గేటు వద్దనే విద్యార్థిని కన్నీళ్లు పెట్టుకుంది. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేటలో ఈ విషాద ఘటన చోటు చేసుకుంది. రాజన్న సిరిసిల్ల జిల్లా గొల్లపల్లికి చెందిన పిట్ల శరణ్య గొల్లపల్లి–బొప్పాపూర్ రాచర్ల జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతున్నది. బుధవారం ఇంటర్ ఫస్టియర్ ఎగ్జామ్స్ ప్రారంభం కావడంతో తన తండ్రి ఎగ్జామ్ సెంటర్ ఎల్లారెడ్డిపేటలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ దగ్గర దించుతానని చెప్పాడు. అయితే, పని చూసుకుని టైమ్ వరకు వస్తానని వెళ్లిన తండ్రి ఎంత సేపటికీ రాకపోవడంతో.. ఎగ్జామ్‌కు లేటవుతుందని గాబరాగాబరాగా బస్టాండ్‌కు వెళ్లింది. అక్కడ ఆర్టీసీ బస్సు ఎక్కి ఎగ్జామినేషన్ సెంటర్‌కు చేరుకుంది. కానీ అప్పటికే 9.05 గంటలు దాటిపోవడంతో అధికారులు శరణ్యను ఎగ్జామ్ సెంటర్2లోనికి అనుమతించలేదు. దీనిపై శరణ్య కాలేజీ సిబ్బందిని, ఉన్నతాధికారులను సంప్రదించింది. ఈ క్రమంలో తహశీల్దార్ సుజాత ఎగ్జామ్ సెంటర్‌కు చేరుకుని, సీసీ కెమెరాలను పరిశీలించారు. ఈ క్రమంలో శరణ్య 17 నిమిషాలు ఆలస్యంగా ఎగ్జామ్ సెంటర్ వద్దకు వచ్చినట్లుగా అధికారులు నిర్ధారించారు. దీంతో ఆమెను పరీక్షకు అనుమతించలేదు. తమ భవిష్యత్‌కు సంబంధించిన పరీక్షలు రాసేటప్పుడు కచ్చితంగా సమయపాలన పాటించాలని తహశీల్దార్ సూచించారు.

## డయేరియా ప్రబలడంతో ఒకరు మృతి

**విధుల్లో నిర్లక్ష్యం..కమిషనర్‌పై వేటు**

**అమరావతి,ఫిబ్రవరి 25** : శ్రీకాకుళం మున్సిపల్ కమిషనర్‌పై ప్రభుత్వం సస్పెన్షన్ వేటు వేసింది. నగరంలో డయేరియా ప్రబలడంతో ఒకరు మృతిచెందగా.. 76 మంది ఆస్పత్రి పాలయ్యారు. విధుల్లో కమిషనర్ కూర్మారావు నిర్లక్ష్యంగా వ్యవహరించారంటూ ప్రభుత్వం ఆయన్ను సస్పెండ్ చేసింది. ఈ మేరకు పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీకాకుళం నగరంలోని పలు ప్రాంతాల్లో డయేరియా ప్రబలింది. దమ్మలవీధి, గోల్కొండ రేవు, కాకివీధి, మంగువారితోట తదితర ప్రాంతాలకు చెందినవారు అస్వస్థతకు గురై ఆస్పత్రుల్లో చేరారు. మరోవైపు ప్రభుత్వం ఆయా ప్రాంతాల్లో ఇంటింటా సర్వే నిర్వహించింది. వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి స్వల్ప లక్షణాలతో బాధపడుతున్న వారికి చికిత్స అందిస్తోంది. నగరపాలక సంస్థ సిబ్బంది ట్యాంకర్లతో మంచినీటి సరఫరా చేస్తున్నారు.

## రాష్ట్రవ్యాప్తంగా అందుబాటులో 2,721 డయాలసిస్ మిషన్లు

**మండలి ప్రశ్నోత్తరాల్లో మంత్రి సత్యకుమార్ వెల్లడి**

**అమరావతి,ఫిబ్రవరి 25** రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 2,721 డయాలసిస్ మిషన్లు అందుబాటులో ఉన్నాయని వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఇందులో ప్రభుత్వ ఆసుపత్రుల్లో 985 మిషన్లు, నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో 1,736 డయాలసిస్ మిషన్లు ఉన్నాయని వెల్లడించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 21,504 మంది కిడ్నీ సంబంధిత వ్యాధిగ్రస్తులు ఉన్నారన్నారు. ఏపీలో డయాలసిస్ కేంద్రాల సంఖ్య పెంపుపై శాసనమండలిలో ఎమ్మెల్సీలు అడిగిన ప్రశ్నకు మంత్రి సత్యకుమార్ యాదవ్ సమాధానం ఇచ్చారు. ఉద్దానం ప్రాంతంలో కిడ్నీ బాధితుల సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు. రాష్ట్రంలో డయాలసిస్ కేంద్రాలను పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 20 నెలల్లో 14 కొత్త డయాలసిస్ కేంద్రాలను మంజూరు చేశామని మంత్రి వెల్లడించారు. గతంలో నెలకు సుమారు 40 వేల డయాలసిస్ సెషన్లు జరుగగా... ప్రస్తుతం 66 వేల సెషన్లకు పెరిగాయని మంత్రి తెలిపారు. 675 మంది పేషెంట్లకు నెలకు 10 వేల రూపాయల చొప్పున పింఛన్లు అందిస్తున్నామని చెప్పారు. కిడ్నీ మార్పిడి చేసుకున్న రోగులకు కూడా పింఛన్లు అందించే అంశాన్ని పరిశీలిస్తున్నామని వివరించారు. కిడ్నీ రోగుల చికిత్సపై సగటున 86 వేల రూపాయల చొప్పున గత 20 నెలల్లో మొత్తం 224 కోట్ల రూపాయలు ఖర్చు చేశామని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు.

## మచిలీపట్నంలో పట్టపగలే భారీ దోపిడి

**టీచర్ ఇంట్లో 50 తులాల బంగారం, నగదు చోరీ**

**మచిలీపట్నం,ఫిబ్రవరి25** : కృష్ణా జిల్లా మచిలీపట్నంలో పట్టపగలే భారీ చోరీ చోటుచేసుకుంది. చిలకలపూడి సర్కార్ తోట ప్రాంతంలో ఓ ఉపాధ్యాయురాలి ఇంట్లో ఈ ఘటన చోటుచేసుకుంది. గుడ్లవల్లేరు మండలం కౌతరం ఉర్దూ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న మార్గరెట్ బుధవారం ఉదయం తన ఇంటికి తాళాలు వేసుకొని పాఠశాలకు వెళ్లారు. రంజాన్ మాసం కావడంతో పాఠశాలకు మధ్యాహ్నం సెలవు ప్రకటించడంతో ఆమె ఇంటికి వచ్చారు. తలుపులు పగలగొట్టి ఉండటంతో ఇంట్లో చోరీ జరిగిందని నిర్ధరించుకుని.. చిలకలపూడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు క్లూస్ టీంతో ఘటనాస్థలికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. దాదాపు 50 తులాల బంగారం, రూ.1,40,000 నగదు చోరీ జరిగినట్లు బాధితురాలు తెలిపారు.

## తెలంగాణ ఎప్‌సెట్ పరీక్షపై కన్వీనర్‌తో టి-సాట్ స్పెషల్ లైవ్

**హైదరాబాద్,** : మే నెలలో నిర్వహించే ఎప్ సెట్ పోటీ పరీక్షకు విద్యార్థులను సిద్ధం చేసేందుకు టి–సాట్ నెట్వర్క్ ఈ నెల 26వ తేది గురువారం రోజు ప్రత్యేక లైవ్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. లైవ్ కార్యక్రమంలో తెలంగాణ ఎప్ సెట్ కన్వీనర్ కె.విజయ్ కుమార్ రెడ్డి పాల్గొని విద్యార్థినీ, విద్యార్థులకు పలు సలహాలు–సూచనలు అందించనున్నారు. ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు ఇంజనీరింగ్, అగ్రికల్చర్, కోర్సులలో చేరేందుకు తెలంగాణ ప్రభుత్వం కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ మే 13, 14 తేదిల్లో నిర్వహించనుంది. కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ లో మెరుగైన ర్యాంకు సాధించేందుకు తోడ్పాటుగా టి–సాట్ నెట్వర్క్ ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. టి–సాట్ నిపుణ ఛానల్ లో ఉదయం 11 నుండి 12 గంటల వరకు జరిగే లైవ్ కార్యక్రమంలో పాల్గొనే కన్వీనర్ విజయ్ కుమార్ విద్యార్థుల సందేహాలకు సమాధానం ఇవ్వడంతో పాటు సలహాలు అందించనున్నారు. ఎప్ సెట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు వారి తల్లిదండ్రులు 040–23556037, 23553473 టోల్ ఫ్రీ నెం.1800 425 4038 నెంబర్లకు కాల్ చేయాలని టి–సాట్ నెట్వర్క్ కోరింది. ఇప్పటికే ఎప్ సెట్ పరీక్ష కోసం టి–సాట్ నెట్వర్క్ నాలుగు గంటల పాఠ్యాంశాల ప్రసారాలను కొనసాగిస్తున్న విషయం పాఠకులకు విదితమే. తెలంగాణ విద్యాశాఖలో భాగమైన సమగ్ర శిక్ష మరియు పోలీసు శాఖలో భాగమైన ఉమెన్ సేఫ్టీ వింగ్ సంయుక్తంగా 'చైల్డ్ సేఫ్టీ' పేరుతో గురువారం ఉదయం 11 గంటలకు ప్రత్యేక ప్రత్యక్ష కార్యక్రమం కొనసాగనుంది. పిల్లల రక్షణ విషయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, పిల్లలకు ఇబ్బందులు ఎదురైతే ఎవరిని సంప్రదించాలి, విద్యార్థి దశలో ఎటువంటి విషయాల జోలికి వెళ్లకూడదు అనే తదితర ప్రధాన అంశాలపై విద్యార్థులను చైతన్య పరిచే కార్యక్రమం టి–సాట్ విద్య ఛానల్ లో ఉదయం 11 నుండి 12 గంటల వరకు ప్రసారమౌతుంది. విద్యార్థినీ, విద్యార్థులు తమ సందేహాలు–సమాధానాల కోసం 040–2354 0326, 2354 0726 టోల్ ఫ్రీ నెం.1800 425, 4039 నెంబర్లకు కాల్ చేయాలి. టి–సాట్ నెట్వర్క్ ఈ మేరకు సూచించింది.

## రాష్ట్రంలో అదుపుతప్పిన శాంతిభద్రతలు

**బాన్సువాడలో శృతిమించిన ఎంఐఎం ఆగడాలు**

**కామారెడ్డి, నిజామాబాద్ ఘటనలపై డిజిపికి బిజెపి ఫిర్యాదు**

**హైదరాబాద్, ఫిబ్రవరి25** : తెలంగాణలో శాంతిభద్రతలు దెబ్బతిన్నాయని, హిందువులు లక్ష్యంగా దాడులు పెరిగాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు అన్నారు. కామారెడ్డి ఘటనలో కాంగ్రెస్ గూండాగిరి బయటపడిందన్నారు. ఈ మేరకు తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డిని రామచంద్రరావు బుధవారం కలిశారు. ఈ సందర్భంగా కామారెడ్డి, నిమాజాబాద్ జిల్లాల్లో జరిగిన ఘటనలపై డీజీపీకి ఫిర్యాదు చేశారు. అనంతరం రామచంద్రరావు మీడియాతో మాట్లాడుతూ.. కొన్నిరోజుల క్రితం బాన్సువాడలో ఎంఐఎం నేతలు ఆందోళనలు సృష్టించారని తెలిపారు. ఈ ఘటనపై నిరసన తెలిపిన హిందూ యువకులను పోలీసులు అరెస్ట్ చేశారన్నారు. దాదాపు 27 మంది హిందూ యువకులను జైలుకు పంపారని తెలిపారు. హిందూ కుటుంబాలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని రామచంద్రరావు మండిపడ్డారు. కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణా రెడ్డి క్యాంప్ ఆఫీసుపై కాంగ్రెస్ నేతలు దాడి చేసేందుకు యత్నించారని ఆయన అన్నారు. నిజామాబాద్‌లో అడ్వకేట్ కళ్యాణిపై ఎంఐఎం నేతలు దాడి చేశారని ఆరోపించారు. 'నామ్ కే వాస్తే' దాడి చేసిన వారిపై చర్యలు తీసుకుంటున్నారని రామచంద్రరావు మండిపడ్డారు. హిందూ ఆలయాలపై దాడులు జరుగుతున్నాయని రామచంద్రరావు తెలిపారు. చాంద్రాయణ గుట్ట, ముత్యాలమ్మ గుడి, సికింద్రాబాద్‌లో హిందూ ఆలయాలపై దాడులు జరిగాయని పేర్కొన్నారు. వీటిని ప్రోత్సహిస్తున్నది కాంగ్రెస్ కాదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ బుజ్జగింపు రాజకీయాలు మానుకోవాలని డిమాండ్ చేశారు. సీఎం వద్దే హోం శాఖ ఉందని.. తెలంగాణలో మరీ ముఖ్యంగా ఉత్తర తెలంగాణలో శాంతి భద్రతలు దెబ్బతిన్నాయని ఆయన విమర్శలు గుప్పించారు. పోలీసులు అరెస్ట్ చేసిన హిందూ యువకులను వెంటనే విడుదల చేయాలని, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని రామచంద్రరావు డిమాండ్ చేశారు.

## దొంగతనాలకు అలవాటు పడ్డ ఉద్యోగి

**విజయవాడ,ఫిబ్రవరి25** : ఎన్టీఆర్ జిల్లా తిరువూరు రూరల్ మండలం చిక్కుళ్లగూడెం గ్రామంలో జరిగిన చోరీ కేసును పోలీసులు చేదించారు. చోరీకి పాల్పడిన వ్యక్తిని అరెస్ట్ చేశారు. నిందితుడిని విజయవాడకు చెందిన ప్రభుత్వ ఉద్యోగి అసిస్టెంట్ లైన్‌మెన్ నంద సుభాష్‌గా గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నంద సుభాష్ చెడు వ్యసనాలకు బానిసై నేరాలకు పాల్పడుతున్నాడు. ఈ నేపథ్యంలోనే తిరువూరు మండలం గానుగపాడు గ్రామంలో బైక్ చోరీ చేశాడు. దొంగిలించిన బైక్‌పైనే వృద్ధురాలైన ఉప్పు అనసూర్య మెడలో 40 గ్రాముల బంగారు నాన్తాడు చైన్‌ను లాక్కెళ్లిపోయాడు.

## ప్రభుత్వ పరిశీలనలో ఆడబిడ్డ నిధి పథకం

**మండలిలో సభ్యుల ప్రశ్నలకు మంత్రి కొండపల్లి సమాధానం**

**అమరావతి, ఫిబ్రవరి25** : ఆడబిడ్డ నిధి పథకం ప్రభుత్వ పరిశీలనలో ఉందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్ని రకాల పింఛన్ల మొత్తాన్ని పెంచిందని మంత్రి వివరించారు. వృద్ధాప్య పింఛన్లను 3 వేల నుంచి 4 వేల రూపాయలకు పెంచామని, ఏడాదికి రూ.33 వేల కోట్లు పింఛన్ల రూపంలో ఖర్చు చేస్తున్నామని చెప్పారు. సూపర్ సిక్స్ హామీలన్నీ అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి స్పష్టం చేశారు. ఏపీ శాసనమండలిలో 'ఆడబిడ్డ నిధి' పథకం అమలుపై వైసీపీ ఎమ్మెల్సీలు ప్రశ్నలు లేవనెత్తారు. 'ఆడబిడ్డ నిధి పథకం ఎప్పటి నుంచి అమలు చేస్తారు.. ఇచ్చే ఉద్దేశం ఉందా' అని ఎమ్మెల్సీ సూర్యనారాయణరాజు ప్రశ్నించారు. జూన్ 2024 నుంచే పథకాన్ని అమలు చేస్తామని ఎన్నికల సమయంలో బాండ్లు ఇచ్చారని ఎమ్మెల్సీ వరుదు కల్యాణి గుర్తుచేశారు. సభ్యుల ప్రశ్నలకు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సమాధానం ఇచ్చారు. మంత్రి సమాధానం ఇస్తున్న సమయంలో సభలో వైసీపీ ఎమ్మెల్సీలు ఆందోళన చేశారు. ఆడబిడ్డ నిధి పథకం ఎప్పటి నుంచి అమలు చేస్తారో సూటిగా చెప్పాలని డిమాండ్ చేశారు. వెంటనే మంత్రి పార్థసారథి మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో పలు స్కీమ్‌లలో జరిగిన లోపాలను మంత్రి శ్రీనివాస్ చెబుతున్నారని తెలిపారు. చివరకు.. అధికార, విపక్ష సభ్యుల ఆందోళనల మధ్యే ఆ ప్రశ్నకు సమాధానం వచ్చినట్లుగా ఛైర్మన్ కొయ్యే మోషేన్ రాజు ప్రకటించారు

## ఆర్థిక మూలాలు పెంచేలా చేయాలి

**పశుసంవర్ధకశాఖను అభివృద్ధి పరచాలి**

**కొత్త ఆలోచనలతోనే పశుసంవర్ధక శాఖలో మార్పులు**

**బడ్జెట్ ప్రతిపాదనలు సిద్ధం చేయండి**

**అధికారులతో మంత్రి వాకిటి శ్రీహరి సమీక్ష**

**హైదరాబాద్, ఫిబ్రవరి25** :పాడి పరిశ్రమ పరిపూర్ణంగా ముందుకు సాగితేనే తెలంగాణ అభివృద్ధి సాధ్యం అని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించేలా నివేదికలు తయారు చేయండని మంత్రి సూచించారు. ఆర్థికంగా ఎదిగేలా ప్రభుత్వ పథకాలను రూపొందించాలన్నారు. పశుసంవర్ధక శాఖకు సంబంధించి హర్యానా, తమిళనాడు, గుజరాత్ రాష్ట్రాల మోడల్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. పశుసంవర్ధక, పాడి పరిశ్రమలో ఏం చేస్తే సక్సెస్ అవుతామో అధ్యయనం చేయాలన్నారు. ఆరోగ్యకరమైన తెలంగాణను నిర్మిస్తేనే భవిష్యత్ బాగుంటుందని, అందుకోసం స్వచ్ఛమైన పాలు, బలమైన పోషకాలు ఉన్న చికెన్, మటన్, చేపల ఉత్పత్తి చేయాలన్నారు. ఉన్నతాధికారులు, అధికారులు సమన్వయం చేసుకుంటూ బాధ్యతతో పనిచేస్తే మంచి ఫలితాలు వస్తాయని సూచించారు. ఆర్థిక స్వావలంబన లభించే పథకాలను రూపొందించి అమలుచేద్దాం అని అన్నారు.

తెలంగాణకు ఆర్థిక మూలాలు పెంచేలా పశుసంవర్ధకశాఖను అభివృద్ధి పరచాలని మంత్రి వాకిటి శ్రీహరి అధికారులకు దిశానిర్దేశర చేశారు. . కొత్త ఆలోచనలతోనే పశుసంవర్ధక శాఖలో మార్పులు తీసుకురాగలమని మంత్రి వాకిటి శ్రీహరి ఆశాభావం వ్యక్తం చేశారు. పాడి పరిశ్రమ పరిపూర్ణంగా ముందుకు సాగితేనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని వివరించారు. బడ్జెట్‌లో నిధులు ఎన్ని కేటాయించారనేది కాకుండా ఎంతమేరకు ఖర్చు చేశామనే ఆలోచన చేసుకోవాలని మంత్రి వాకిటి శ్రీహరి సూచించారు. బ్జడెట్ లో అధిక నిధులు కేటాయించేలా నివేదికలు తయారు చేయాలని అధికారులను మంత్రి వాకిటి శ్రీహరి ఆదేశించారు. ఆర్థికంగా ఎదిగేలా ప్రభుత్వ పథకాలను రూపొందించాలని మంత్రి సూచించారు. పశుసంవర్ధక శాఖకు సంబంధించి హర్యానా, తమిళనాడు, గుజరాత్ రాష్ట్రాల మోడల్‌ను ఆదర్శంగా తీసుకొని రాష్ట్రంలో పథకాలను డిజైన్ చేయాలని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు.




Printed, published and owned by Rachamallu Madhavi Printed at Kranthi Printing Press, 42/603/1/1-a, Mj Colony, Street no 5, Mjcolony, Moulali Secundrabad, and Published from h.no: 10-10-117/150, Nayi brahmana colony. Neerugonda Hanuman road, Nagaram Nizamabad (m&d) 503001, Telangana, Editor : Rachamallu Madhavi. RNI Reg No :tel/2024/89323, Cell 6305026524, Email:janasangarshana@gmail.co